గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 184, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శనివారం - 10- ఆగష్టు - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


2

## ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ..
### ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ ఎంపీలు

హైదరాబాద్ : ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణతో పాటు క్రిమీలేయర్ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పును ఇచ్చింది. అయితే ఆ తీర్పుపై వంద మంది బీజేపీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయసభలకు చెందిన ఆ ఎంపీలు.. ప్రొఫెసర్ సికందర్ కుమార్ నేతృత్వంలో .. ప్రధాని మోడీని ఇవాళ కలిశారు. అందరు ఎంపీల ఫిర్యాదులను ప్రధాని మోడీ ఆలకించారని, ఎంపీలకు అనుకూలంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని


2

## అమెరికా పర్యటనలో సీఎం బిజీబిజీ..
## అడోబ్ సిస్టమ్స్ సీఈవోతో భేటీ

**న్యూఢిల్లీ,:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి.. రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలన్నారు. రాష్ట్రానికి వస్తే తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పి రాయితీలు ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు

## మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు..
### విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు..


వివరాలు 2లో..

హైదరాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు.. మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు గుభాలిస్తున్నాయని చెప్పారు. గిరిజనులు, ఆదివాసీల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆదివాసీల మూడు డిమాండ్లయిన స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలను కేసీఆర్ నిజం చేశారని తెలిపారు. మావ నాటే మావ రాజ్..

# ప్రభుత్వ నిర్వాకంతో నగర ప్రజలకు తీవ్ర నష్టం

### అంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదు...
### పరిపాలనను గాలికి వదిలి...
### బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అని అనాలా?

హైదరాబాద్,: రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో హైదరాబాద్ నగర ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. హైదరాబాద్ నగర త్రాగునీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. నల్గొండ రైతులు సాగునీటి అవసరాలు తీరకుండా హైదరాబాద్ నగరానికి సుంకిశాల నీళ్లను ఎట్లా తీసుకువెళ్తారని ఆందోళన చేశారన్నారు. రైతులను ఒప్పించి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 90 మిలియన్ గ్యాలన్ల నీళ్లను సుంకిశాల నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్ హయాంలో 108 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం ఇచ్చారన్నారు. కేసీఆర్ వచ్చాక కాళేశ్వరం, సీతారామ లాంటి ప్రాజెక్టులు కట్టి రైతుల్లో సాగునీటికి ఢోకా లేకుండా చేశారని తెలిపారు. కేసీఆర్ సుంకిశాల విషయంలో నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా హైదరాబాద్ నగరానికి త్రాగు నీళ్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. తాము సుంకిశాలకు వెళ్లి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చడానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. సుంకిశాల నుంచి మూడు పైప్ లైన్ల ద్వారా నీళ్లను ఎత్తిపోసి హైదరాబాద్ నగరానికి నీళ్లను తీసుకువచ్చామన్నారు.

అంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదు...

ఎల్లంపల్లి నుంచి గోదావరి నీళ్లు, సుంకిశాల నుంచి క్రిష్ణా నీళ్లు,మల్లన్న సాగర్ నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి తేవడమే లక్ష్యంగా కేసీఆర్ పని చేశారని చెప్పుకొచ్చారు. ఢిల్లీలో నీటి కోసం యుద్ధాలను చూస్తున్నామని... కానీ హైదరాబాద్ నగరానికి అలాంటి పరిస్థితి రాలేదన్నారు. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు కేసీఆర్ హైదరాబాద్ నగరానికి నీళ్లను తేవడంలో కృషి చేశారన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. సీతారామను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టినట్లు భట్టి గొప్పలు చెప్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం దిగిపోయాక ప్రభుత్వం సుంకిశాలను పట్టించుకోలేదని... అయితే హైదరాబాద్


2లో

నగరంలో త్రాగునీటికి ఇబ్బందులు వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వానికి సుంకిశాల గుర్తుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖ పాలన పడకేసిందన్నారు. సుంకిశాల రిటైనింగ్ గోడ కూలిన రోజు ఆగస్టు 2న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం స్టేట్మెంట్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయం వచ్చిందా? లేదా? అనేది స్పష్టం చేయాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి రాకపోతే అంతకంటే సిగ్గుచేటు లేదని విమర్శించారు. ప్రభుత్వానికి తెలిసినా వారం రోజులు దాచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హడావిడిగా ప్రభుత్వం గేట్లు అమర్చడం వలన ప్రమాదం జరిగిందన్నారు. కూలీలు షిఫ్ట్ మారే సమయంలో రిటైనింగ్వా ల్ కూలడంతో ప్రమాదం తప్పిందన్నారు.

పరిపాలనను గాలికి వదిలి...

సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకుని పాలన గాలికి వదిలేశారని వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మేడిగడ్డలో ప్రమాదం జరిగితే..

## వక్ఫ్ బిల్లుపై "జేపీసీ" ఏర్పాటు..
## డీకే అరుణ, ఓవైసీలకు చోటు..

- "జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)"కి పంపనున్నట్లు వెల్లడి
- 1995 వక్ఫ్ చట్టంలోని 44 సెక్షన్‌ని సవరించాలని చట్టం ప్రతిపాదించింది



**హైదరాబాద్, :** వక్ఫ్ బోర్డు 'అపరిమిత అధికారాలకు' చెక్ పెట్టేందుకు కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అయితే, ఈ బిల్లును కాంగ్రెస్‌తో పాటు దాని మిత్రపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన నిర్వహించాయి. ఈ బిల్లు రాజ్యంగ వ్యతిరేకమని, మైనారిటీల హక్కుల్ని ఉల్లంఘిస్తుందని ఆరోపించింది. విపక్షాల ఆరోపణల నేపథ్యం కేంద్రం ఈ బిల్లును సమగ్రంగా చర్చించేందుకు "జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)"కి పంపనున్నట్లు వెల్లడించింది. ఈమేరకు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ప్రభుత్వం జేపీసిని ఏర్పాటు చేసింది. జేపీసీ కోసం అధికార, ప్రతిపక్షాలకు చెందిన 21 మంది ఎంపీల పేర్లను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించారు. ఈ కమిటీలో బీజేపీకి చెందిన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి చోటు దక్కింది. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌తో పాటు ఎంపీలు ఇమ్రాన్ మసూద్, కృష్ణ దేవరాయులు, మహ్మద్ జావేద్, కళ్యాణ్ బెనర్జీ,

## పవన్ విజ్ఞప్తితో ఏపీకి నిధులిచ్చిన మోడీ!!


2

**అమరావతి,:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటూ అవసరం మేరకు కేంద్ర సహకారం కూడా తీసుకుంటున్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ కూలీలకు శుభవార్త చెప్పిన విషయం తెలిసిందే.

ఉపాధి హామీ కూలీల కోసం పవన్ కళ్యాణ్ శుభవార్తలు

కేంద్రానికి ఉపాధి హామీ కూలీల కోసం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన మేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గానూ లేబర్ బడ్జెట్ ను 21.50 కోట్ల పనిదినాలకు పెంచడానికి కేంద్రం అంగీకరించిందన్నారు.

## పవన్ కళ్యాణ్ 'స్మగ్లర్' వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో దుమారం


2

- నిన్న కర్ణాటకలో పవన్ కళ్యాణ్ పర్యటన
- గత హీరోలు చెట్లను కాపాడేవారన్న పవన్
- ఇప్పటి హీరోలు చెట్లను నరికే స్మగ్లర్ పాత్రలు పోషిస్తున్నారని వెల్లడి
- పవన్ ఈ వ్యాఖ్యలు బన్నీని దృష్టిలో ఉంచుకుని చేశాడంటూ నెటిజెన్ల ఫైర్

అమరావతి,: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిన్న కర్ణాటక పర్యటన సందర్భంగా బెంగళూరులో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.

## ఏపీలో ఐటీ, పరిశ్రమ అభివృద్ధి చర్యలపై
## మంత్రి నారా లోకేశ్ సమీక్ష


వివరాలు 2లో..

- ఐటీ అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు 10 అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో చర్చిస్తానన్న మంత్రి
- రియల్ టైం గవర్నెన్స్‌ను మరింత మెరుగ్గా రూపొందించాలని అధికారులకు సూచన
- తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ క్లస్టర్ అభివృద్ధితో పాటు విడి భాగాల తయారీ యూనిట్స్ ఏర్పాటుకు కృషి చేయాలని సలహా

# "వారధి".. పవన్ మాత్రమేనా, మోడీని కూడా ఫిక్స్ చేసిన చంద్రబాబు!!


వివరాలు 2లో..

- ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచన
- బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రతి నెల అందుబాటులో బీజేపీ నేతలు
- చంద్రబాబు బాటలో పవన్ కళ్యాణ్ కూడా జనసేన ఎమ్మెల్యేలు, మంత్రులకు షిఫ్ట్ లు

- ప్రజా సమస్యల పైన వినతులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం " వారధి " కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది
- పజల కోసం చేసే మంచి కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేసే కార్యక్రమమే " వారధి

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు బాటలో ఇప్పుడు ఏపీ బీజేపీ కూడా నడుస్తుంది. సీఎం చంద్రబాబు పార్టీ కార్యాలయంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు డ్యూటీలు వేసి పార్టీ కార్యాలయంలో ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఇక చంద్రబాబు బాటలో పవన్ కళ్యాణ్ కూడా జనసేన ఎమ్మెల్యేలు, మంత్రులకు షిఫ్ట్ లు వేశారు.

# పోలీసుల సమక్షంలోనే పెద్దసుబ్బారాయుడిని చంపేశారు

### నంద్యాల జిల్లాలో వైసీపీ కార్యకర్త హత్య
### కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన జగన్
### ఏజెంటుగా కూర్చున్నందుకు చంపేశారని ఆగ్రహం
### పోలీసుల సమక్షంలోనే హత్యాకాండ జరిగిందని ఆరోపణ


2లో

**అమరావతి,:** నంద్యాల జిల్లా సీతారామాపురంలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త పెద్దసుబ్బారాయుడు కుటుంబాన్ని మాజీ సీఎం జగన్ ఈ మధ్యాహ్నం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీసుల సమక్షంలోనే పెద్దసుబ్బారాయుడిని చంపేశారని వెల్లడించారు. పెద్దసుబ్బారాయుడి భార్యపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. నిందితులు పారిపోవడానికి పోలీసులు సహకరించారని ఆరోపించారు. నిందితుల కాల్ డేటా చూస్తే ఎవరు చేయించారో అర్థమవుతోందని, ఈ కేసులో చంద్రబాబు, లోకేశ్ లను కూడా ముద్దాయిలుగా చేర్చాలని జగన్ డిమాండ్ చేశారు. ఏజెంటుగా కూర్చున్నందుకు హత్య చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు మీటింగ్ లు పెట్టి, చంపాలని చెబుతున్నారని, హత్య చేయించిన వారిని కూడా జైల్లో పెట్టాలని అన్నారు. సీతారామాపురం గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని తెలిసి కూడా ఎందుకు అదనపు బలగాలను దించలేదని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎస్పై సమక్షంలోనే మారణకాండకు దిగారని, నిందితులు గ్రామం వదిలి వెళ్లిపోయేవారకు వారిని పట్టుకునేందుకు పోలీసులు ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు. ఏపీలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోందని, ఆధిపత్యం కోసం హత్యలు చేస్తున్నారని జగన్ వ్యాఖ్యానించారు. సీతారామాపురం ఘటనపై హైకోర్టుకు వెళతామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళతామని స్పష్టం చేశారు.

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ..
## ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ ఎంపీలు

మొదటి పేజి తరువాయి

అందరు ఎంపీల ఫిర్యాదులను ప్రధాని మోడీ ఆలకించారని, ఎంపీలకు అనుకూలంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని ఎంపీ సికందర్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేపట్టాలని వేసిన పిటీషన్లపై తీర్పును ఇస్తూ.. ఏడుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. క్రిమీలేయర్ అంశంపై సుప్రీం కోర్టు చేసిన సూచనల గురించి దరఖాస్తు ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. క్రిమీలేయర్ నిర్ణయాలను అమలు చేయరాదు అని వంద మంది ఎంపీలు ప్రధాని మోడీని కోరినట్లు తెలుస్తోంది.

## అమెరికా పర్యటనలో సీఎం బిజీబిజీ..
# అడోబ్ సిస్టమ్స్ సీఈవోతో భేటీ

మొదటి పేజి తరువాయి

ప్రధాని మోడీ హామీ ఇచ్చారని ఎంపీ సికందర్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేపట్టాలని వేసిన పిటీషన్లపై తీర్పును ఇస్తూ.. ఏడుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. క్రిమీలేయర్ అంశంపై సుప్రీం కోర్టు చేసిన సూచనల గురించి దరఖాస్తు ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. క్రిమీలేయర్ నిర్ణయాలను అమలు చేయరాదు అని వంద మంది ఎంపీలు ప్రధాని మోడీని కోరినట్లు తెలుస్తోంది.

## మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు..

మొదటి పేజి తరువాయి

ఆదివాసీల మూడు డిమాండ్లయిన స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలను కేసీఆర్ నిజం చేశారని తెలిపారు. మావ నాటే మావ రాజ్.. మా తాండాలో మా రాజ్యం అనే ఆదివాసీల ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ 2,471 గూడేలను, తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చారని చెప్పారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆదివాసీ గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు వారికి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. జల్.. జంగల్.. జమీన్ అన్న కొమురం భీమ్ నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారన్నారు.

విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు..

మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు..

గిరిజనులు, ఆదివాసీల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. ప్రధానంగా ఆదివాసీల మూడు డిమాండ్లయిన స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలను నిజం చేసింది కేసీఆర్ గారు.

## వక్ఫ్ బిల్లుపై "జేపీసీ" ఏర్పాటు.. డీకే అరుణ, ఓవైసీలకు చోటు..

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌తో పాటు ఎంపీలు ఇమ్రాన్ మసూద్, కృష్ణ దేవరాయులు, మహ్మద్ జావేద్, కళ్యాణ్ బెనర్జీ, జగదాంబికా పాల్, నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, దిలీప్ సైకియా, ఎ రాజా, దిలేశ్వర్ కమైత్, అరవింద్ సావంత్, నరేష్ మాస్కే, అరుణ్ భారతి, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, అభిజిత్ గంగోపాధ్యాయ, మౌలానా మొహిబుల్లా నద్వీ, సురేష్ గోపీనాథ్ సభ్యులుగా ఉన్నారు. జేపీసీ కోసం మరో 10 రాజ్యసభ సభ్యుల పేర్లను సిఫారసు చేయాలని రాజ్యసభను కూడా కోరారు. కేంద్రం రాష్ట్ర వక్ఫ్ బోర్డుల అపరిమిత అధికారాలను కట్టడి చేయడంతో పాటు వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, సర్వే, ఆక్రమణల తొలగింపుకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించడం ఈ చట్టం యొక్క లక్ష్యం. 1995 వక్ఫ్ చట్టంలోని 44 సెక్షన్‌ని సవరించాలని చట్టం ప్రతిపాదించింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ మరియు రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని బిల్లు ప్రతిపాదిస్తుంది. వక్ఫ్ బోర్డు ద్వారా వచ్చే డబ్బును ప్రభుత్వం సూచించిన పద్ధతిలో వితంతువులు, విడాకులు తీసుకున్నవారు మరియు అనాథల సంక్షేమానికి ఉపయోగించాలని కూడా నిర్దేశించింది. మహిళల వారసత్వ సంపదకు రక్షణ కల్పించాలన్నది మరో కీలక ప్రతిపాదన. వక్ఫ్ సంస్థల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చాలనే నిబంధన ప్రతిపాదిత చట్టంలోని మరో వివాదాస్పద అంశం. ఇదిలా ఉంటే, లోక్‌సభలో బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఇది కఠినమైన చట్టమని, మతస్వేచ్ఛ, సమాఖ్య వ్యవస్థపై దాడి అని అన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడాన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ కూడా ఈ బిల్లుని వ్యతిరేకించింది. ఈ బిల్లును బాగా ఆలోచించి రాజకీయాల్లో భాగంగా ప్రవేశపెట్టారని విమర్శించింది. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. " ఈ బిల్లు ఏ మత సంస్థ స్వేచ్ఛని హరించదు. ఎవరి హక్కుల్ని హరించదు. ఎవరైతే ఇప్పటి వరకు హక్కులు పొందలేదో వారికి హక్కుల్ని కల్పిస్తుంది"అని అన్నారు. ఈ రోజు తీసుకువచ్చిన ఈ బిల్లును కాంగ్రెస్ హయాంతో సచార్ కమిటీ నివేదిక ఆధారంగా రూపొందించామని అన్నారు.

# పవన్ విజ్ఞప్తితో ఏపీకి నిధులిచ్చిన మోడీ!!

మొదటి పేజి తరువాయి

ఉపాధి హామీ కూలీల వేతనాలు మంజూరు చేసిన కేంద్రం

ఇక తాజాగా మరో శుభవార్త చెప్పారు పవన్ కళ్యాణ్. తన విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇప్పటి వరకు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2024-25లో మదర్ శాంక్షన్ కింద కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ వేతనాల చెల్లింపుల నిమిత్తం 21.50 కోట్ల పనిదినాలకుగానూ రూ.5743.90కోట్లను మంజూరు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

ఉపాధి హామీ పనులకు అదనంగా రూ.2812.98 కోట్ల మంజూరు

అంతేకాదు గతంలో ఆమోదించిన 15 కోట్ల పని దినాలకు సంబంధించి వేతన నిధులు రూ.2934.80 కోట్లు మంజూరు చేసి.. విడుదల చేసిందనీ, అదనంగా ఇప్పుడు రూ.2812.98 కోట్లను మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు.ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2809.10 కోట్లు రోజువారీ వేతన ఎఫ్.టి.ఓ.ల అప్ లోడ్ ఆధారంగా నేరుగా వేతనదారుల ఖాతాలకు జమ అయ్యాయన్నారు.

పవన్ విజ్ఞప్తితో నిదులిచ్చిన కేంద్రం

మిగిలిన మొత్తాలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలోనే వేతనదారుల ఖాతాలకు జమ అవుతాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. మోడీకి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ నిధుల సత్వర విడుదలకు చేసిన విజ్ఞప్తితో కేంద్రం ఈ నిధులు విడుదల చేసింది. దీంతో ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన డబ్బులు అందటమే కాకుండా వారికి పని దినాలు కూడా పెరగనున్నాయి.

## పవన్ కల్యాణ్ 'స్మగ్లర్' వ్యాఖ్యలతో
# సోషల్ మీడియాలో దుమారం

మొదటి పేజి తరువాయి

40 ఏళ్ల కిందట సినిమాల్లో హీరోలు చెట్లను కాపాడే పాత్రలు పోషిస్తే, ఇప్పటి హీరోలు చెట్లను నరికే స్మగర్ల వేషాలు వేస్తున్నారని పవన్ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాఖ్యానించారు. అందుకు ఉదాహరణగా కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ 1973లో నటించిన 'గంధద గుడి' అనే చిత్రాన్ని ప్రస్తావించారు. ఆ సినిమాలో రాజ్ కుమార్ అడవుల్లోని చెట్లను నరకకుండా స్మగ్లర్లను, వేటగాళ్లను అడ్డుకుంటాడని పవన్ పేర్కొన్నారు. అయితే, పవన్ ఈ వ్యాఖ్యలు అల్లు అర్జున్ ను ఉద్దేశించి చేశాడంటూ ఓ వర్గం నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. పుష్ప, పుష్ప-2 చిత్రాల్లో అల్లు అర్జున్ ఎర్రచందనం స్మగ్లర్ పాత్ర పోషిస్తుండడంతో, ఇటీవల ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న పరిణామాల కారణంగా పవన్ ఈ విధంగా టార్గెట్ చేశాడని ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డికి అల్లు అర్జున్ మద్దతు పలికిన విషయాన్ని మనసులో పెట్టుకుని పవన్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు అనిపిస్తోందని కొందరు నెటిజన్లు కామెంట్ చేశారు. నటనలో అల్లు అర్జున్ కు పవన్ కల్యాణ్ ఏమాత్రం పోటీ ఇవ్వలేదని కొందరు వ్యాఖ్యానించారు.

## ఏపీలో ఐటీ, పరిశ్రమ అభివృద్ధి చర్యలపై
# మంత్రి నారా లోకేశ్ సమీక్ష

మొదటి పేజి తరువాయి

**అమరావతి,:** ఏపీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. పెట్టుబడిదారులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు. ఈ మేరకు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో అధికారులతో భేటీ అయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌ను (ఆర్టీజీఎస్) మరింత మెరుగ్గా రూపుదిద్దాలని అధికారులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో ఐటీ అభివృద్ధి, పరిశ్రమల స్థాపన కోసం దేశంలోని టాప్ 10 మంది పారిశ్రామిక వేత్తలతో చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇన్నోవేషన్ సెంటర్లలో ప్రోత్సాహకాలు అందించి స్టార్టప్‌లకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపర్చాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ క్లస్టర్లను అభివృద్ధి చేయడంతో పాటు విడి భాగాలు తయారు చేసే యూనిట్లను నెలకొల్పేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి సౌరభ్ గౌడ్, ఎండీ ఏపీటీఎస్ రమణారెడ్డి, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డి వెంకటాచలం, ఐటీ జాయింట్ సెక్రటరీ సూర్జిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్వాకంతో నగర ప్రజలకు తీవ్ర నష్టం

మొదటి పేజి తరువాయి

కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మేడిగడ్డలో ప్రమాదం జరిగితే.. ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది కాబట్టి అధికారులు, ఏజెన్సీ వెంటనే స్పందించారని తెలిపారు. సుంకిశాల ప్రమాదం జరిగినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏ ఏజెన్సీకి అయితే సుంకిశాల ప్రాజెక్టు అప్పగించిందో ఆ ఏజెన్సీని వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పటి వరకు తెలియకపోతే పరిపాలన మీద పట్టు ఉన్నట్లా...? అని నిలదీవారు. బిఆర్ఎస్ పార్టీపైన చిల్లర దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంచి జరిగితే వాళ్ళ ఖాతాలో చెడు జరిగితే బీఆర్ఎస్ ఖాతాలో వేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని విమర్శలు గుప్పించారు. ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అని అనాలా?



"మేడిగడ్డలో ప్రమాదం జరిగితే వెంటనే ఎన్.డి.ఎస్.ఏ వస్తుంది. మరి సుంకిశాలకు ఎందుకు ఎన్.డి.ఎస్.ఏ రాదా?. బీజేపీ,కాంగ్రెస్ ఒక్కటే అని తాము అనకూడదా...? సుంకిశాల ప్రమాదంపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదు...?" అంటూ ప్రశ్నలు సంధించారు. త్రాగునీటి అవసరాల కోసమే సుంకిశాల ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. భట్టి విక్రమార్క ఆలోచనా విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రభుత్వానికి తెలుసా అని అడిగారు. నిన్న హైదరాబాద్ నగరంలో మర్డర్ జరిగిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. మేడిగడ్డపై ప్రభుత్వం చేసింది దుష్ప్రచారమన్నారు. మేడిగడ్డ వద్ద పంపింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అన్నపూర్ణ, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌లోకి నీళ్లు వచ్చేది కాళేశ్వరం నుండి కాదా అని అన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు రావద్దని ప్రభుత్వం భావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సోషల్ మీడియాలో వచ్చాక తమపైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

# "వారధి".. పవన్ మాత్రమేనా, మోడీని కూడా ఫిక్స్ చేసిన చంద్రబాబు!!

మొదటి పేజి తరువాయి

ఇక చంద్రబాబు బాటలో పవన్ కళ్యాణ్ కూడా జనసేన ఎమ్మెల్యేలు, మంత్రులకు షిఫ్ట్ లు వేశారు. ఇప్పుడు ఏపీ బీజేపీ వంతు వచ్చింది.

బీజేపీ వారధి కార్యక్రమం

భారతీయ జనతా పార్టీ నుండి ప్రాతినిధ్యం వహించే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఎంపీలు ప్రతి నెల రెండురోజులు ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పైన వినతులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం " వారధి " కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏపీ బీజేపీ ముఖ్య అధికారప్రతినిధి లంకా దినకర్ షెడ్యూల్ ప్రకటించారు.

బీజేపీ కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉండే నేతల షెడ్యూల్

వారధి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం అందుబాటులో ఉండే బీజేపీ ప్రజాప్రతినిధుల షెడ్యూల్ ఇలా ఉంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రతి నెలలో మొదటి సోమవారం, మూడవ సోమవారం అందుబాటులో ఉంటారు. శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రతి నెలలో నాలుగవ



సోమవారం,నాలుగవ మంగళవారం అందుబాటులో ఉంటారు . మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతి నెలలో మొదటి మంగళవారం ,మూడవ మంగళవారం అందు బాటులో ఉంటారు.

ఫిక్స్ డ్ షెడ్యూల్ వేసిన బీజేపీ

శాసన సభ్యులు సుజనా చౌదరి ప్రతి నెలలో మొదటి బుధవారం ,రెండవ బుధవారం అందుబాటులో ఉంటారు. శాసన సభ్యులు ఈశ్వర రావు ప్రతి నెలలో మూడవ బుధవారం,మూడవ గురువారం అందుబాటులో ఉంటారు. శాసన సభ్యులు కామినేని శ్రీనివాసరావు ప్రతి నెలలో మొదటి గురువారం,రెండోవ గురువారం అందుబాటులో ఉంటారు. శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు ప్రతి నెలలో నాలుగవ బుధవారం,నాలుగవ గురువారం అందుబాటులో ఉంటారు.

ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు పార్టీ ఆఫీస్ లో డ్యూటీ

శాసన సభ్యులు ఆది నారాయణ రెడ్డి ప్రతి నెలలో మూడవ శుక్రవారం,మూడవ శనివారం అందుబాటులో ఉంటారు. శాసన సభ్యులు పార్థసారధి ప్రతి నెలలో నాలుగవ శుక్రవారం,నాలుగవ శనివారం అందుబాటులో ఉంటారు ఎంపీ సీఎం రమేష్ ప్రతి నెలలో మొదటి శుక్రవారం,రెండవ శుక్రవారం అందుబాటులో ఉంటారు .కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ప్రతి నెలలో మొదటి శనివారం,రెండవ శనివారం అందుబాటులో ఉంటారు .

మోడీ చెప్పిన మార్గంలో ప్రజల కోసం వారధి

జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రతి నెలలో రెండవ సోమవారం,రెండవ మంగళవారం అందుబాటులో ఉంటారు.ప్రధాని నరేంద్ర మోడీ ఎప్పుడు చెప్పే విధంగా జనతా జనార్దన్ అంటే ప్రజలే దేవుళ్లు అనే మాటను నిజం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా వారధి నిర్వహిస్తామన్నారు లంకా దినకర్. కేంద్ర మరియు రాష్ట్ర ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ పథకాలను, ప్రజల కోసం చేసే మంచి కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేసే కార్యక్రమమే " వారధి ". అని ఆయన తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు... మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం

### ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ
### భారతీయులు, హిందువులు, మైనార్టీల భద్రతను పర్యవేక్షించనున్న కమిటీ
### బంగ్లాదేశ్‌లో హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు

**న్యూఢిల్లీ,:** బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడులు జరుగుతుండటంతో నరేంద్రమోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనార్టీలపై దాడుల ఘటన మీద భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను... సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్రం ఐదుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనార్టీల



భద్రతను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీని నియమించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. అక్కడి భారతీయులు, హిందువులు, మైనార్టీల భద్రత, సౌకర్యాలకు సంబంధించి అక్కడి హోంమంత్రిత్వ శాఖ అధికారులతో ఈ కమిటీ చర్చలు జరుపుతుంది. ఈ కమిటీలో బీఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ ఐజీ, ఐజీ బీఎస్ఎఫ్ త్రిపుర, ఇండియన్ ల్యాండ్ పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సభ్యుడు, సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి మైనార్టీ వర్గాల భద్రత కోసం ఈ కమిటీని ఏర్పాటు చేశామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇస్లామిక్ ఛాందసవాదులు బంగ్లాదేశ్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. సోమవారం మొదలైన దాడుల్లో ఇప్పటి వరకు వందలాది మంది మృతి చెందారు. దాడుల భయంతో హిందువులు సహా చాలా మైనార్టీ కుటుంబాలు మూకుమ్మడిగా వలస బాట పట్టాయి. వారు భారత్‌లోకి వచ్చేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని ఠాకూర్‌గావ్, పంచగఢ్ ప్రాంతాలకు వేలాదిమంది హిందువులు చేరుకున్నారు. పలుచోట్ల ఇళ్లు, దుకాణాలతో పాటు దేవాలయాల్లోని విలువైన వస్తువులను సైతం దుండగులు దోచుకువెళ్లినట్లుగా తెలుస్తోంది. అక్కడే ఉంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు.

# యాక్టివ్ మోడ్‌లోకి సోషల్ మీడియా.. రేవంత్ ప్లాన్ ఇదే

తెలంగాణలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం స్పష్టంగా కనిపించింది.కేసీఆర్ చేతిలో కొన్ని ఛానళ్ళు,సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఉన్నప్పటికీ గులాబి పార్టీని కాంగ్రెస్ ఓడించగలిగింది.దీనికి కారణం సోషల్ మీడియాను కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే.పదేళ్లలో కేసీఆర్ చేసిన తప్పులను,పాలనలో వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు రేవంత్‌రెడ్డి.ఈ ప్లాన్‌తో బీఆర్ఎస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్ళపాటు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. దీంతో అంతా సోషల్ మీడియా మహిమే అని అప్పట్లో కథనాలు వచ్చాయి.అయితే బీఆర్ఎస్ పార్టీని తెలంగాణలో నామరూపాల్లేకుండా చేయాలనుకుంటున్న రేవంత్‌రెడ్డి మరోసారి సోషల్ మీడియాను స్ట్రెంథెన్ చేయబోతున్నారు. పరిస్థితి చూస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మళ్లీ సోషల్ వార్ తప్పేలా లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి.బీఆర్ఎస్ పెట్టే ప్రతి పోస్ట్‌కి దిమ్మతిరిగే కౌంటర్ ఇవ్వడమే లక్ష్యంగా సోషల్ మీడియా వింగ్‌ను మళ్ళీ రెడీ చేస్తోంది కాంగ్రెస్. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాలా యాక్టివ్‌గా ఉండేది కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్. ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడ్డాక సోషల్ మీడియాలో ఉద్యోగులను తగ్గించింది. దీంతో దాని ప్రభావం కూడా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అయితే బీఆర్ఎస్‌ను జీరో చేయాలంటే



సోషల్ మీడియా మళ్ళీ ప్రభావవంతంగా పనిచేయాలని అంటున్న రేవంత్‌రెడ్డి దానిని బలోపేతం చేయడంలో భాగంగా మరోమారు రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఇందులో భాగంగా సోషల్ మీడియా వింగ్ లోనే ఎక్కువగా నియామకాలు చేస్తోందని సమాచారం. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఫేక్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారంటూ బీఆర్ఎస్ మూడు రోజులుగా ప్రచారం చేస్తోంది. ఇదే క్రమంలో కాంగ్రెస్ కూడా గట్టి కౌంటర్ ఇచ్చింది. గతంలో మీరు చేసిన ఒప్పందాల సంగతేంటి అంటూ పాత ఒప్పందాలను బయటకు తీస్తోంది. ఇలా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ రచ్చ మొదలై మరోసారి ఎన్నికల సంగ్రామాన్ని తలపిస్తోంది. బీఆర్ఎస్ పదేళ్ళ పాలన వైఫల్యాలను కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ ఎన్నికల సమయంలో బాగానే ఎండగట్టింది. ఇప్పుడు అదే సోషల్ మీడియాలో కాంగ్రెస్‌ను వెంటాడుతోంది కేటీఆర్ టీం.కాంగ్రెస్ అడుగు తీసి అడుగు వేసినా బీఆర్ఎస్ కామెంట్ చేస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రతిస్పందించాల్సి వస్తోంది. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్స్ స్పీడ్ కూడా తగ్గిపోయింది. బీఆర్ఎస్ అటాక్ చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ సోషల్ మీడియా స్ట్రెంథెన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు. దీంతో వ్యూహకర్త సునీల్ కనుగోల్ టీంని మరోసారి రంగంలోకి దించాల్సి వస్తోంది. సోషల్ మీడియా మళ్ళీ యాక్టివ్ అయ్యేందుకు చర్యలు తీసుకుంటోంది. గత పదేళ్లు బీఆర్ఎస్ చేసిన తప్పులను మరోసారి ఎత్తి చూపేందుకు సిద్ధమవుతోంది రేవంత్ సర్కార్. దీంతో తెలంగాణలో మరోసారి ఎన్నికల స్టంట్ మొదలైందని జనాలు చర్చించుకుంటున్నారు.

# వక్ఫ్ బిల్లుపై జేపీసీ ఏర్పాటు - తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు..!!


వక్ఫ్ బిల్లు పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు అయింది. 21 మంది లోక్ సభ..10 మంది రాజ్యసభ సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటు చేసారు. వక్ఫ్ బిల్లు పైన లోక్ సభలో ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసాయి. మత స్వేచ్ఛకు విఘాతంగా ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ధ్వజమెత్తాయి. దీంతో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసారు.

పార్లమెంట్ లో చర్చ

1995నాటి వక్ఫ్ సవరణ చట్టాన్ని సమీకృత వక్ఫ్ యాజమాన్య, సాధికారిక, సామర్థ్య అభివృద్ధి చట్టంగా మారుస్తున్నామంటూ కేంద్రం బిల్లు ప్రతిపాదించింది. ఈ బిల్లు పైన ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ తోపాటు ఇండియా కూటమికి చెందిన పార్టీలన్నీ ఈ బిల్లు దేశాన్ని విభజించేలా ఉందని విమర్శించాయి. ఎన్డీయే మిత్రపక్షాలు సమర్ధించాయి. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రం ఈ బిల్లును రూపొందించిందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని దుయ్యబట్టారు.

జేపీసీ ఏర్పాటు

ముస్లిమేతరులను వక్ఫ్ పాలకమండలిలో సభ్యులుగా చేర్చడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ముస్లింలపైనే కాక క్రైస్తవులు, జైనులపై దాడులు చేయడం బీజేపీ లక్ష్యమని




విమర్శించారు. ఇక మైనారిటీలే తమ ఆస్తులను నిర్వహించుకునేందుకు రాజ్యాంగంలోని 30వ అధికరణ వీలు కల్పిస్తోందని, ఈ బిల్లు ఆ అధికరణకు వ్యతిరేకమని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న అభ్యంతరాలతో ప్రభుత్వం జేపీసీకి అంగీకారం తెలిపింది. ఇప్పుడు సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమిస్తూ సభ్యులను ఖరారు చేసారు.

కమిటీలో సభ్యులుగా

జేపీసీలో గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, టీడీపీ ఎంపీ క్రిష్ణ దేవరాయుల, మహ్మద్ జావేద్, కళ్యాణ్ బెనర్జీ, జగదాంబికా పాల్, నిశికాంత్ దుబే, తేజశ్విన సూర్య, దిలీప్ సైకియా, ఏ రాజా, దిలేశ్వర్ కామత్, అర్విండ్ సావంత్, నరేశ్ మాస్కే, అరుణ్ భార్థి, ఎంఐఎం అధినేత అసద్ తో పాటుగా అపరాజితా సారంగి, సంజయ్ జైశ్వాల్, అభిజిత్ గంగోపాధ్యాయ, డీకే అరుణ, మహ్మద్ జావేద్, మౌలానా మోహిబుల్లా నద్వీ, సురేష్ గోపీనాథ్ పేర్లను ప్రకటించారు. రాజ్యసభ నుంచి పదిమందిని జేపీసీలోకి ఎంపిక చేసారు. ఈ కమిటీ బిల్లు పైన అధ్యయనం చేసి పార్లమెంట్ కు నివేదిక ఇవ్వనుంది.

## యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గా భారీ లో పెంట ప్రణయ్



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): సామాజిక సేవను తమ సేవగా భావించి సేవా కార్యక్రమాల లో చురుకుగా పాల్గొంటూ , కొమిరెడ్డి రాములు కి ముఖ్య అనుచరుడుగా అలాగే, ప్రస్తుత వారి తనయుడు కొమిరెడ్డి కరంచంద్ తో ఉంటూ పలు సమస్యలపై పోరాటం చేస్తూ కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న పెంట ప్రణయ్.. ఈనెల 10వ తేదీ నా జరగనున్న యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి గా ఎన్నికల బరిలో పోటీ చేయడానికి జరుగుతుంది, ఎన్నికల్లో తనను గెలిపించాలని యువతరానికి సేవ చేయడానికి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని నన్ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం మెట్పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడారు.. గత 2014 నుండి 2019 వరకు కోరుట్ల నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ఎన్ఎస్యూఐ అధ్యక్షుడిగా కొనసాగానని, విద్యార్థి నాయకుడిగా నియోజకవర్గ విద్యార్థి, కాలేజీ సమస్యలపై, వసతులపై ధర్నాలు, రాస్తారోకోలు చేశానని తెలిపారు. 2019లో జరిగిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికల బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందానని గుర్తు చేశారు అనంతరం పట్టణ మున్సిపల్ ఎన్నికలలో వార్డ్ కౌన్సిలర్ గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయానని, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు నిర్వహించిన హాత్ జోడో, బాత్ జోడో కార్యక్రమంలో పాల్గొని జగిత్యాల జిల్లాలో మొదటి స్థానం దక్కిందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పార్టీ కార్యక్రమాలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ఎందరో బాధితులకు రక్తదానం చేసి అండగా నిలిచానని, సామాజిక సేవలో సైతం ముందుండే తన సేవలను దృష్టిలో పెట్టుకొని నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.

## పానగల్ ఎస్సైగా కే ,శ్రీనివాస్




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా పరిధిలోని పానగల్ ఎస్సైగా కే ,శ్రీనివాస్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు, వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిసి ఆర్ యేసయ్య పనిచేస్తున్న శ్రీనివాసును పానగల్ ఎస్సైగా బదిలీ చేశారు, గతంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల తిమ్మాజీపేట మండలాల ఎస్సైగా పనిచేసే చిన్న వయసులోనే పోలీస్ శాఖలో ఉద్యోగం పొందిన శ్రీనివాస్ క్రీడల పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తూ అప్పట్లోనే వాలీబాల్ ఆటలో పెట్టని పేరుగా రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు, శ్రీనివాస్ ఎస్ఐగా అంచలంచెలుగా ప్రమోషన్ తో రావడం అభినందనీయమని పానగల్ మండల ప్రజలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, హర్షం వ్యక్తం చేశారు,

## ప్రతి పల్లెలో 'స్వచ్ఛదనం- పచ్ఛదనం' ఆవిష్కృతం కావాలి

**సమిష్టి కృషితో వాతావరణ సమతుల్యాన్ని కాపాడుదాం.**

**రాష్ట్ర మంత్రి పొంగులేటి తో కలిసి వన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ప్రతి పల్లెలో పచ్చదనం, స్వచ్ఛదనం ఆవిష్కృతం ఐనప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని, ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం లోని లక్ష్మీదేవిపల్లి మండలం, చాతకొండ బీట్ పరిధిలోని రేగళ్ల రోడ్డులో అటవీశాఖ ఏర్పాటుచేసిన ప్లాంటేషన్ ఆవరణలో శుక్రవారం జరిగిన వన మహోత్సవం, స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కూనంనేని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం కూనంనేని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'పచ్ఛదనం-స్వచ్ఛదనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ముందుకు సాగాలని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలన్నారు. పచ్చదనం, స్వచ్ఛదనంపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహల కల్పించినప్పుడే ఫలితాలు లభిస్తాయని, వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతామని అన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ చీకటి కార్తీక్ మరియు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారాలు , నాయకులు పాల్గొన్నారు.

## 31 వ వార్డులో ఫ్రైడే డ్రై డే నిర్వహించిన అడిషనల్ కలెక్టర్!!









నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి పట్టణ మున్సిపాలిటీ లోని 31వ వార్డు బసవన్న గడ్డ ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే రోజు డ్రై డే కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ నిర్వహించారు, ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వార్డుల్లో పర్యటించి ప్రజలను చైతన్యవంతులను చేశారు వర్షాకాల సీజన్ లో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇండ్లలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని దోమల వ్యాప్తి చెందకుండా పరిసరాల చుట్టుముట్టు చెత్తాచెదారం నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు, అంతేకాక వార్డుల్లో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఇందుకోసం మున్సిపల్ కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టాలని ఆయన సూచించారు, ఈ వర్షాకాల సందర్భంగా డెంగ్యూ ,మలేరియా, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు వార్డులలోని ప్రజలను సూచన సలహాలు ఇవ్వాలని ఆయన అన్నారు, బసవన్న గడ్డ ఏరియాలో అంగన్వాడి కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు అంతేకాక బాలామృతం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలు తమ తమ పిల్లలకు తల్లిపాలు స్థాపించాలని తల్లిపాలు అమృతం లాంటివని తల్లిపాల వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జీవితకాలం ఉండే విధంగా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో 31 వ వార్డు కౌన్సిలర్ బండారు విజయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ జయ, ఉపాధ్యాయురాలు అనురాధ భాయ్ ఆశా వర్కర్ శైలజ అంగన్వాడీ టీచర్ శ్రీదేవి ఆయా కార్యకర్త లావణ్య విద్యార్థులు బసవన్న గడ్డ కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు,

## అచ్చంపేటలో స్వచ్ఛధనం -పచ్ఛదనం



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): నాగర్ కర్నూలు జిల్లాలోని అచ్చంపేట పట్టణ మున్సిపాలిటీలో 5వ వార్డులో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛదనం - పచ్ఛదనం కార్యక్రమం అచ్చంపేట మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని వైస్ ప్రిన్సిపాల్ మంతటి. క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు,కమీషనర్ శ్యాంసుందర్ హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చైర్మన్ గార్లపాటి శ్రీనువాసులు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వర్షా కాలంలో మన ఇంటి చుట్టూ మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రతి ఒక్కరు సమాజంలో ఒక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులు,ప్లాస్టిక్ వాడకం, వ్యక్తిగత పరిశుభ్రత పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి ఫైజా ఆరవ తరగతి,ద్వితీయ బహుమతి భాగ్యలక్ష్మి ఆరవ తరగతి,తృతీయ బహుమతి సింధు ఆరవ తరగతి బహుమతులు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గార్లపాటి శ్రీనువాసులు,కమిషనర్ శ్యాంసుందర్,పాఠశాల యాజమాన్యం కోట భాస్కర్,ఇందిరమ్మ,లావణ్య,గౌసియ,ఉదయ కుమారి,స్వప్న,సరిత,మాధవి,ప్రణీత మున్సిపల్ సిబ్బంది సాజీద్,ప్రేమ్, పార్వతి అంగన్వాడీ టీచర్స్,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్,అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది!!

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి!!**

**జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పిలుపు**




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): గంజాయి రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కావాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గంజాయి కి వ్యతిరేకంగా విద్యార్థి,యువత భాగ్యసామ్యం కావాలి పోస్టర్స్ విడుదల చేశారు,నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునందన్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది , ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరం అని . దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతఅని మార్పు రావాల్సింది యువతలో, మార్పు తేవాల్సింది కూడా యువతే అని దురదృష్టవశాత్తు నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారనీ గంజాయి డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం వలన యువశక్తి పెడదారిపడుతున్నదినీ అందుకు యువత వాటికి దూరంగా ఉండాలి అని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీగైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు ,యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలి." సకల అనర్థాలకు అరాచకాలకు హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడకం వంటి మత్తు వ్యసనాలను దూరం చేయకుండా సమాజం బాగుపడదనీ .గంజాయి, డ్రగ్స్ మారుమూల గ్రామాలకు పట్టణాలకు వ్యాప్తి చెందడం అత్యంత ఆందోళన కలిగించే విషయమని తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్, బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్ట్వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారు. గంజాయి కొనడానికి డబ్బుల్విలేదని కన్నవారినే కడతేర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయనీ గంజాయి దొరకడం లేదని, గంజాయికి, డ్రగ్స్ కి బానిసలై మత్తు నుంచి బయటపడలేక ప్రాణాలు తీసుకుంటున్నారనీ మధ్యతరగతి ప్రజానీకమే లక్ష్యంగా పోలీసుల కన్నుగప్పి అంతరపంటగా గంజాయిని సాగుచేయడం దాన్ని యువతరానికి అలవాటు చేసి, ఆతర్వాత మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నారనీ. పక్కా ప్లాన్ ప్రకారం యువకులకు, చిన్నారులకు ఈ మాదక ద్రవ్యాలను అలవాటు చేస్తున్నారనీ,అక్రమ రవాణా చేస్తున్నారనీ.భ్రమల్లో తేలియాడించి ఊహల పల్లకీలో ఊరేగించి, రంగుల ప్రపంచం చుట్టూ పరిభ్రమించేలా చేయగల శక్తి మాదక ద్రవ్యాలకుందనీ యువత నమ్ముతున్నారాని ఈ డ్రగ్స్ అలవాటు పడిన వారికి మానవ ప్రపంచంతో సంబంధాలుండవనీ మంచి-చెడు విచక్షణ కనిపించదనీ. స్వప్నలోకాల్లో విహరిస్తూ, మత్తు వదలిన తర్వాత అనేక శారీరక, మానసిక బలహీనతలకు గురై, మళ్ళీ అదే మత్తుకోసం చేయకూడని అకృత్యాలన్నీ చేస్తారనీ ,డ్రగ్స్ మాఫియా వలలో చిక్కి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి, చట్టవిరుద్ధమైన డ్రగ్స్ రవాణాకు పాల్పడతారనీ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదనీ. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తుంది అని ,యువత సైతం అదేవిధంగా అక్రమ రవాణాను అడ్డుకోవాలనీ ప్రజా-చైతన్య కార్యక్రమాలు చేపట్టాలనీ , తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సమాజం అందరూ కలిసి కట్టుగా పోరు సాగిస్తే మాదక ద్రవ్యాలు మహమ్మారిని తరిమివేయడం సాధ్యం అవుతుందనీ. ప్రజల్లో రు అవగాహన కల్పించేందుకు సామాజిక సంఘాల వారు అందరికీ కౌన్సిలింగ్లు నిర్వహించాలనీ. విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలనీ. విద్యా సంస్థల దగ్గర ఉండే చిన్న చిన్న దుకాణదారులకు సైతం డ్రగ్స్, గంజాయి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బస్తీలల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు, మత్తు తో అరాచక శక్తులుగా మారుతున్న ఈ పరిస్థితులు మారాలనీ ,ప్రజల్లో మార్పు రావాలనీ మత్తులో తూలుతున్న యువతను ఆ మత్తు నుండి బయటకు తీసుకురావాలనీ సకల అనర్థాలకు, సమాజంలో చోటుచేసుకుంటున్న అరాచకాలకు, అమానుషత్వ ధోరణులకు "మత్తు" ప్రధాన కారణం అని అనేక సర్వేలు సూచిస్తున్నాయనీ. మానసిక ప్రవర్తనలో విపరీతమైన ధోరణులను ప్రేరేపించి, రు అరాచకత్వానికి నాంది పలుకుతున్న డ్రగ్స్ ను యువత నుండి దూరం చేయాలనీ ,డ్రగ్స్ లేని సమాజాన్ని రూపొందించడానికి మరింత కృషి చేయాలనీ డ్రగ్స్, గంజాయి నిర్మూలనకై, వివేకవంతమైన సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ నడుంబిగించాలనీ ఖండాంతరాలకు విస్తరించిన డ్రగ్స్ దందాను అరికట్టాలనీ ,నగరాలను దాటి, పల్లెల్లోకి ప్రవేశించిన గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని కూకటివ్రేళ్ళతో పెకిలించాలనీ. సమాజంలో ఈ రుగ్మతలను పారద్రోలేందుకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(%ఙఖీ×%) బాధ్యత తీసుకుని గోడ పోస్టర్స్ స్టిక్కర్స్ ముద్రించి బాధ్యత తీసుకోవటం అభినందనీయం అని మత్తులేని సమాజాన్ని నిర్మించే ఈకృషిలో డి వై ఎఫ్ ఐ మంచి పాత్ర పోషించాలి అని అందులో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు , ఈ కార్యక్రమంలో డి వై ఎఫ్ ఐ జిల్లా నాయకులు సురేష్ సుభాష్ శివ తదితరులు పాల్గొన్నారు.భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వర్ధంసైదులు తెలిపారు,

# నాగర్ కర్నూల్ జిల్లాలో 562 కోట్ల రుణాల మాఫీ!!

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెల్లడి!!**





నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): నాగర్ కర్నూలు జిల్లాలోని వివిధ గ్రామాల్లో మొత్తం 20 మండలాలలో జిల్లాలో 104 ప్రభుత్వ ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులు వాణిజ్య బ్యాంకులలో పంట రుణాలు తీసుకున్న రైతుల రుణాలను ప్రభుత్వం మొదటి విడత రెండో విడతల మొత్తం ,562,33 కోట్ల రుణాలను మాఫీ చేసిందని నాగర్ కర్నూల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు, జిల్లాలో 2 లక్షల రూపాయల పంట రుణమాఫీ కింద ప్రభుత్వం మొదటి విడత మొత్తం 46వేల 780 మంది రైతులకు గాను 265 కోట్లను మాఫీ చేసిందని అదేవిధంగా రెండవ విడత లక్ష యాభై వేల వరకు పంట రుణాలు పొందిన మొత్తం రైతులు 30 వేల 501 మంది రైతులకు గాను 247 కోట్ల రూపాయలను మాఫీ చేసిందని ఈ విధంగా మొదట విడత లక్ష రూపాయల వరకు పంట రుణాలను పొందిన రైతులకు మాఫీ వర్తించిందని అదేవిధంగా రెండో విడత లక్ష యాభై వేల వరకు రుణాలు తీసుకున్నా రైతులకు రుణమాఫీ పథకం కింద మాఫీ అయినట్లు ఆయన తెలిపారు ,మొత్తం నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 77, 281 మంది రైతులకు గాను 562 కోట్లు ప్రభుత్వం రుణమాఫీ కింద మాఫీ చేసింది, మూడో విడత రుణమాఫీ ఆగస్టు 15 రోజు ప్రభుత్వం 2 లక్షల వరకు పంటలను పొందిన రైతులకు మాఫీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు, అంతేకాక నాగర్ కర్నూల్ జిల్లాలో 2024 -25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ ఖరీఫ్ సీజన్లో మొత్తం 2,56,532 ఎకరాల భూమి వివిధ పంటల కింద సాగు అయినట్లు ఆయన తెలిపారు, రైతులకు వ్యవసాయ శాఖ మండల అధికారులు గ్రామాలలోని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటూ రైతు రుణమాఫీ తో పాటు వ్యవసాయ పంటలకు సంబంధించిన సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారని ఆయన తెలిపారు, రైతులు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ వేదికల దగ్గర ఏఈవోలు ప్రతిరోజు అందుబాటులో ఉంటారని ఏమైనా సలహాలు అనుమానాలు వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులకు వివరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు,

# ఆదివాసీల ఆస్తిత్వాన్ని కాపాడాల్సిన భాధ్యత ప్రభుత్వాలదే.

ఏఐటీయూసీ, టిజిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నరాటి ప్రసాద్, భూక్యా శ్రీనివాస్.

టిజిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఆదునికతకు దూరంగా కొండకోనల్లో నివసించే ఆదివాసీల అభివృద్ధిని పాలకులు పూర్తిగా విస్మరించారని, ఆదివాసీలను కేవలం ఓటుబ్యాంకుగానే ఏలికలు పరిగణించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అడవి బిడ్డల ఆరాధ్యులు కొమరం భీమ్, బిర్సా ముండ, సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన భాద్యత కేంద్ర, రాష్ట్ర పాలకులదేనన్నారు. ఆదివాసీల జీవన విధానాన్ని గుర్తించి వారి అభ్యున్నతికోసం పాలకులు కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఐఖ్యరాజ్య సమితి ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. అడవులనే నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులను ఆ అడవుల నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని, అడవుల పరిరక్షణ పేరుతో దాడులు, నిర్బంధాలకు పాల్పడుతూ గిరిజనుల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మల్లిస్తుండటంతో గిరిజన గ్రామాలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో గిరిజనుల సంక్షేమంకోసం రూపొందించిన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ ఆదివాసీలు అభివృద్ధి సాధించలేకపోతున్నారన్నారు. కొమరంభీం, బిర్సాముండ, సేవాల్, మల్లుదొర, సమ్మక్క, సారక్క లాంటి ఎందరో ఆదివాసీ నాయకులు రాజ్యాంగం కల్పించిన చట్టాల అమలు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి స్పూర్తితో హక్కుల సాధన, పెట్టుబడి దారుల ఆదిపత్యం నుండి బైటపడేందుకు ఆదివాసీ గిరిజనులు సంఘటితమై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి వీరస్వామి, మాజీ సర్పంచ్ గూగుల్ నాగేష్, చందర్, శంకర్, మహేష్, సక్రం, జోతియా, కిషన్, మనోజ్, చిరు, బాలాజీ, వెంకటేష్ ,పండు, భరత్, భావుసింగ్, టింకు, సంతు, కె. రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ఫ్రైడే డ్రైడే సందర్భంగా టైర్ల షాప్ ల లో అవగాహన

**మున్సిపల్ కమిషనర్ టి మోహన్**





మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే డ్రైడే సందర్భంగా పలు వార్డులలో వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో చెట్లు నాటడం జరిగింది మరియు పంచర్ టైర్ల షాపుల వద్దకు వెళ్లి టైర్లల ఉన్న నీటిని తొలగించి వారికి అవగాహన చేయడమైనది పాత ఇన్ప సామాన్ షాపుల వద్దకు వెళ్లి వాళ్లకు అవగాహన చేసి పాత సామాన్లు నిల్వ ఉన్న నీటిని తీసివేయడం జరిగింది ఇళ్లలో ఉన్న సిమెంట్ కుండీలను మరియు కూలర్లను పరిశీలించి వాటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి కుండీలు బోర్లించడం జరిగింది పలు వార్డులలో స్కూళ్లలలో మురికి కాల్వల పై బ్లీచింగ్ వేయడం ఆంటీ లార్వా స్ప్రే చేయించడం అయినది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి మోహన్ టెక్నికల్ ఆఫీసర్ నరేష్ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ సోమిడి శివ నిజాం అశోక్ నరేష్ మహేష్ రాజశేఖర్ ప్రజలువార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు

## మరణించిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

**కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు**



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై మరణించిన కుటుంబాన్నిప్రభుత్వం ఆదు కుంటుందని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిజువ్వాడి నర్సింగరావు తెలిపారు. పాఠశాలలో జరిగిన సంఘటన పై విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర వెంకటేశం తో విద్యార్థి అస్వస్థతకు గురై ఆసుపత్రిలోచికిత్సపొందుతూ మరణించిన విషయాన్నిజువ్వాడి నర్సింగరావు తెలిపారు. దీనిపై ప్రిన్సిపాల్ సెక్రటరీ స్పందించి మరణించిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపినట్లుజువ్వాడి ఫోన్ లో విలేకరులకు తెలిపారు. నెలలో ఇద్దరు విద్యార్థుల మరణించిన పాఠశాలసిబ్బంది అప్రమత్తంగాఉండడంలేదని అగ్రహించారు.ప్రస్తుతం నిజామాబాద్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు త్వరగా కోలుకోవాలని జువ్వాడి నర్సింగరావు కోరారు.

## కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



టేకులపల్లి మన **(గౌతమ్ న్యూస్):** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా బోడు గ్రామంలో తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ కల్తీ సత్యనారాయణ అధ్యక్షతన కొమరం బీమ్ విగ్రహావిష్కరణ నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగ వర్గ ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే





కోరం కనకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించగా మూత్తి సత్యం ఆదివాసి ఆల్ ఇండియా కన్వీనర్, తుడుందెబ్బా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి,సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అవునూరి మాట్లాడుతూ. అడవిని అడవి సంపదను ఖనిజ సంపదను దోచుకోవడం కోసమే అడవికి మూలవాసులైన ఆదివాసీలను పేరుతో దాడులు చేస్తున్నారని అటవీ సంరక్షణ నియమాల పేరుతో నూతన చట్టాలను తీసుకువచ్చారని ఎన్నో ఏళ్లుగా అడవిని నమ్ముకుని పోడుకొట్టుకొని సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలను వెళ్ళ గొట్టడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని వారు అన్నారు.ఇప్పటికే ఆదివాసీల సంస్కృతి,సాంప్రదాయాలను అణిచివేయడం కోసం సామ్రాజ్యవాద విష సంస్కృతిని ప్రవేశపెట్టారని ఆయన అన్నారు.ఆదివాసీలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా సాంస్కృతికంగా వెనకబడిన వారని ఆయన తెలియజేశారు. ఖనిజ సంపద కోసం ఈశాన్య మధ్య భారతంలో సామ్రాజ్యవాద రూపంలో ఉన్న పాలకులు ఆదివాసీలపై యుద్ధం ప్రకటించారని జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాడిన బిర్సం ముండా, గుండాధర్ ,ఖాన్ సింధు,కొమరం భీమ్,రాంజీ గోండు ,కోటన్న,బాటన్న ,లింగన్నలు అనేకమంది ఈ పోరాటంలో భాగస్వామ్యులైనారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర కుంజ సాంబయ్య, పటేల్ మాడె లాలయ్య, ఎట్టి నరసింహారావు, మేడే ప్రదీప్, కుంజ శివ, ముడిగ నరసింహారావు, పూనం స్వామి, ఎట్టి ప్రశాంత్, ఈసాల రవి, గుమ్మడి సమ్మయ్య టీచర్ యూనియన్, జోగా రాంబ్రహ్మం టీచర్ యూనియన్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి అవకాశం కల్పించే విధంగా ప్రజాప్రతినిధులు సేవలందించాలి

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

### ఉత్సహాంగా మండల పరిషత్తుల పాలకవర్గం వీడ్కోలు సభలు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : ప్రజా ప్రతినిధిగా భాధ్యతను అప్పగించిన ప్రజలకు నిస్వార్ధంగా, రాజకీయకు అతీతంగా సేవలందించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ పాలకవర్గం వొడ్కోలు సభ సాయిరాం ఫంక్షన్ హాల్లో, సుజాతనగర్ మండల పరిషత్ విడ్కోలు సభ సుజాతనగర్లోని రైతువేదికలో శుక్రవారం జరిగింది. కార్యక్రమాలకు కూనంనేని ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రజలు అప్పగించిన భాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించామని సంతృప్తితో పదవి విరమణ పొందినప్పుడే ప్రజలు మరో సారి సేవచేసే అవకాశాన్ని కల్పిస్తారనే విషయాన్ని మరవొద్దన్నారు. సుజాతనగర్ మండల సమగ్రాభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని, ఇప్పటికే వివిధ గ్రాంటులు, పథకాలతో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర ప్రజా మౌలిక వసతుల కల్పించామని, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మండల అభివృద్ధికోసం చేస్తున్న కృషికి ప్రజా పరిషత్ పాలక మండలి సంపూర్ణంగా సహకరించిందని తెలిపారు. పదవి విరమణ పొందిన స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజా క్షేత్రంలో ఉంటూ తమ సేవలను కొనసాగించి మండలాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివోలు చలపతిరావు, బానోత్ భారతి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపివోలు శ్రీనివాస్, భూక్యా శ్రీను, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ శాఖల అధికారులు శివలాల్, వెంకటస్వామి, రఘు, మాజీ ప్రజా ప్రతినిధులు, వసంత, బిందు చౌహాన్, సోనా, భూక్యా పద్మావతి, నూనావత్ గోవిందు, కుంజా రాంబాబు, కొమరం లలిత, బాతుల మానస, భద్రమ్మ, భద్రం, శిరీష, తదితర ఎంపిటిసిలు, స్థానికులు భూక్యా దస్రు, జక్కుల రాములు, రాజశేఖర్, కుమారి హన్మంతరావు, శాపావట్ రవి, జర్పుల ఉపేందర్, బోడ రాములు, జర్పుల శ్రీను, ధర్మారావు, బాలు లక్ష్మీనారాయణ, దండు నాగేశ్వర్ రావు, మండే చంటి, కొమారి కృష్ణ, హనుమంతు, హత్తిరామ్, హరి, భద్రు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం

### ఉపాధి హామీ అధికారులతో కలిసి మొక్కలు నాటిన విద్యుత్ అధికారులు.



కొండాపూర్ **(గౌతమ్ న్యూస్):** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముని దేవునిపల్లి, మనసాన్పల్లి, గొల్లపల్లి, మందాపూర్, మల్లేపల్లి, మల్కాపూర్ తదితర గ్రామాల్లో ఉపాధి హామీ అధికారులతో పాటు విద్యుత్ అధికారులు కలిసి మొక్కలు నాటి నీరు



పోశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 75వ వనమహోత్సవం లోభాగంగా స్వచ్ఛతనం పచ్చదనంకార్యక్రమం ప్రతి గ్రామంలో బాధ్యతగా మొక్కలు నాటి నాటిన మొక్కలను సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ వీరారెడ్డి,మండల విద్యుత్ అధికారి, సిద్ది రాజ్, ఇంచార్జ్ ఎంపీడీవో రత్నవేణి, ఏపీవో వీరప్ప,టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, ప్రభాకర్, పంచాయతీ సెక్రటరీలు నవీన్,కిషోర్,నవ్వత్ ఫాతిమా, రజిని ఆయా గ్రామ సెక్రటరీలు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

## అంబులెన్స్ సిబ్బంది ఆసరా...

### ఎల్లవేళలా అందుబాటులో, రోగులకు ప్రధమ చికిత్సలో ముందు వరుసలో,



ఏటూరునాగారం**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: అసలే వానాకాలం అందులో సీసనల్ వ్యాధులు, జ్వర బాధితులతో నిండుపోతున్న ఆసుపత్రి వార్డులు, జ్వరం వచ్చిన 24 గంటల్లోనే ఒళ్ళు నొప్పులు, కాళ్ళు, మోకాళ్ల నొప్పులు,గొంతు తల నొప్పితో ఆసుపత్రుల్లో చేరుతున్న రోగులకు రక్త పరీక్షలు చెయ్యగా నూటికి 80 శాతం డెంగ్యూ జ్వరం ఉండి గంటల వ్యవధిలోనే రక్తకణాలు తగ్గిపోయి శ్వాస తీసుకోవడం ఇబ్బంది గా మారడంతో ఏటూరునాగారం ఆసుపత్రిలో వందల మందికి పదుల రోజులు వైద్యం అందించినప్పటికి నయం కాకపోవడతో ములుగు జిల్లా,వరంగల్ పట్టణంలోని ఎంజీఎం ఆసుపత్రికి అంబులెన్స్ సహాయంతో తరలిస్తున్నారు. రోజుకు 3 నుండి 5 కేసులను తరలిస్తున్నాం:ఈఎంటి శివలింగంప్రసాద్. 108 కి సమాచారం రాగానే హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని రక్త కణాలు తగ్గి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్న పేసేంట్ ని మానిటర్ పర్యవేక్షణలో ,ఆక్సిజన్ లెవెల్ తక్కువగా ఉన్నావాళ్ళకి కావాల్సిన మందులు ,గ్లూకోసులువచ్చిక్షేమంగాపెద్దాసుపత్రులకు తరలిస్తున్నాం, రోజుకు ఏటూరునాగారం ఆసుపత్రి నుండి పదుల సంఖ్యలో కేసులు రివర్ అవుతున్నాయని ఎల్లవేళలా రోగులకు చికిత్స అందిస్తున్నామని ఈఎంటి శివలింగంప్రసాద్,పైలెట్ వినోద్ అన్నారు.



## కొత్తగూడెం నియోజకవర్గంలో పక్కా రహదారులు, డ్రైనేజి వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం

### రాష్ట్ర మంత్రి పొంగులేటితో కలిసి అశోక్ నగర్ డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిస్కారం చూపేందుకు అడుగులు వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్ నగర్-ప్రగతి నగరులో ముర్రేడు వాగును కలుపుతూ రూ.1.50కోట్ల పంచాయతీ రాజ్ ద్వారా ఏంఆర్ఆర్, ఎస్డిఆర్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కూనంనేని శంకుస్థాపన చేశారరు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో పక్క రహదారులు, డ్రైనేజి నిర్మాణాలపై ప్రత్యేక ద్రుష్టి సారించినట్లు తెలిపారు. వివిధ పథకాలు, గ్రాంట్ల ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు సంబంధించి నిధుల మంజూరికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. ప్రగతినగర్, అశోక్ నగర్లో నిర్మించనున్న డ్రైనేజి నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత పరిస్కారం లభిస్తుందని, గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రతియేటా వర్షాకాలంలో కాలనీ ముంపుకుగురై ప్రజలు ఇబ్బందులు పరిస్థితి ఉండేదన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇన్చార్జ్ చీకటి కార్తీక్, మాజీ జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, తూము చౌదరి, పూనెం శ్రీనివాస్, పద్మ, వివిధ శాఖల అధికారులు, స్థానికులు జర్పుల మురళి, కౌన్సిలర్లు పి. సత్యనారాయణాచారి, బండి నర్సింహా, పిల్లలమర్రి మురళి, సాదిక్, చెలమల సత్యం, రంగనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడుల రద్దుకు క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో పోరాటం

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్.

### కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : భారత దేశంలో కార్పొరేట్లకు,వ్యాపారస్తులకు, బడపారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడుల రద్దుకు క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో పోరాటం సాగిద్దామని ఏఐటియుసి జిల్లా ప్రధాన నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం లోని ఎంజి రోడ్ గాంధీ విగ్రహం ముందు) ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, సీఐటీయూ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమం స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు జలీల్. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి సారంగపాణి. మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈరోజు నిరసన తెలియజేయడం జరుగుతుందని అన్నారు.దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు...ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా తయారు చేశారని,4 లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కోడులను తెచ్చిందన్నారు. రోజుకు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచనున్నార అన్నారు. కార్మికులకు పోరాటం చేసే హక్కు ఉండదన్నారు. ఎన్నికల సమయంలో నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగం ఇస్తానని చెప్పి ,ఉన్న ఉద్యోగాలు అన్నింటిని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చారని అన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక కర్షక వ్యతిరేక బడ్జెట్ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు,సంవత్సర కాలం పాటు రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేసిన రైతులపై కంటే కార్పొరేట్ శక్తుల మీదే మోడీకి ప్రేమ ఎక్కువ ఉందని అన్నారు కనీస మద్దతు ధర ప్రకటించకపోగా ఉన్న సంక్షేమ పథకాలన్నీ తొలగించినారని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పేరు చెప్పి ఒక సంవత్సర కాలంలో సుమారుగా 60 కోట్ల రూపాయలను రిలయన్స్ కంపెనీకి అప్పజెప్పారని మండిపడ్డారు, దేశ అత్యంత న్యాయస్థానం తీరు ప్రకారం దేశంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్,థర్డ్ పార్టీ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు కంచర్ల జమలయ్య, భాస్కర్, భూక్యా శ్రీనివాస్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు ఎస్. రాంచందర్. సీఐటీయూ జిల్లా నాయకులు లిక్కి బాల్రాజ్, వీరన్న, భూక్యా రమేష్. ఐఎఫ్టియు నాయకులు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాలు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు కార్యక్రమాలలో స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ముందుగా లక్ష్మీదేవి పల్లి మండలం అశోక్ నగర్ కాలనీలో సుమారు కోటి 50 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుకుంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామని అన్నారు. అనంతరం అటవీశాఖ వారి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా లక్ష్మీదేవి పల్లి మండలం చాటకొండ బీట్ లో స్వచ్ఛతనం – పచ్చదనం ముగింపు లో భాగంగా వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. తర్వాత వన మహోత్సవం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వన మహోత్సవ



లక్ష్యాలని అందరూ సాధించాలని తెలిపారు. కొత్తగా పోడు వ్యవసాయం ఎవరు చేపట్టరాదని చేపట్టిన యెడల చర్యలు తప్పవని తెలిపారు. పోడు వ్యవసాయం చేసే రైతులకు అటవీ శాఖ అధికారులు జామాయిల్ పెంపకం తదితర పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. అటవీ శాఖ అధికారులు పోడు వ్యవసాయం నిర్వహిస్తున్న గిరిజనులతో స్నేహభావంగా ఉండాలని అన్నారు. గత సంవత్సరం గిరిజనుల దాడిలో మరణించిన శ్రీనివాస్ రేంజర్ కుటుంబ సభ్యులకు 500 గజాల ఇంటి స్థలం పట్టాని రెవెన్యూ మంత్రిగా త్వరలో అందజేస్తామని తెలిపారు. పాల్వంచ మండలంలో సుమారు 50 లక్షల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన సింథటిక్ టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ టెన్నిస్ కోర్టులో 70 నుంచి 80 మంది నిత్యం శిక్షణ పొందేలా రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి క్రీడాకారులతో కలసి టెన్నిస్ ఆడారు. ఖేలో ఇండియా లో భాగంగా ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. క్రీడాకారులతో మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. అనంతరం క్రీడా ప్రాంగణంలోమొక్కను నాటారు. జిల్లా ఐ డి ఓ సి కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా) ద్వారా గ్రూప్ యాక్టివిటీ కింద ఓం సాయిరాం మహిళా సంఘం, వినాయక పేద ప్రాంత సమాఖ్య భరతమాత పట్టణ సమాఖ్య కొత్తగూడెం మున్సిపాలిటీ వారు 6,00,000 రూపాయల బ్యాంకు రుణ సహాయంతో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారికి ఋణ సదుపాయాలు అందించి వివిద ఆదాయాబివృద్ధి కార్యక్రమం చేపట్టుటకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగింది అని అన్నారు. మహిళా సాదికారతను సాధించుటకు రాబోయే 5 సంవత్సరాలలో చిరు వ్యాపారాలను ప్రోత్సహిస్తూ సంఘ సభ్యులకు నైపుణ్యం పనిలో శిక్షణ ప్యాకింగ్ మరియు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్ ను నెలకొల్పడం మిని ఇండస్ట్రీయల్ పార్క్, వడ్డీ రుణాలు, లోన్స్, మరియు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయుట ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందని అన్నారు.గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అక్క చెల్లెమ్మలందరు ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు.కొత్తగూడెం లో మొత్తం 5 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మొదటి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలన్నారు. నాణ్యతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ డి ఓ విద్యా చందన, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మరియు పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి,జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, మెప్మా డీఎంసీ రాజేష్, మహిళా సంఘ సభ్యులు, క్రీడాకారులు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి!!

### నాగులకు పాలు పోసిన మహిళ లోకం!!



### దేవాలయాలలో సందడి!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** నాగుల చవితి పండుగను పురస్కరించుకుని ఎక్కడ చూసినా దేవాలయాలు మహిళల తో భక్తి శ్రద్దల మధ్య ఘనంగా నాగుల చవితి పండుగను జరుపుకున్నారు, ప్రతి సంవత్సరం నాగుల చవితి వచ్చిందంటే చాలు మహిళలు నిష్టతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమీపంలోని పుట్టలకు పాలు పోసి భక్తిని చాటుకుంటారు, నాగేంద్రుడు శివునికి వాసుకి గా మహావిష్ణువు శేషుడిగా తోడుంటారు కాబట్టి నాగుల చవితి రోజు భక్తులు నైవిద్యాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆచారం దీనివల్ల సర్పర్ రోగాలు పోయి సౌభాగ్యం కలగాలని విశ్వసిస్తుంటారు, పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలు పూజా కార్యక్రమాలకు సంబంధించిన వస్తువులు పుట్టల దగ్గర పెట్టి పూజలు నిర్వహిస్తారు, నాగుల చవితి సందర్భంగా ఎక్కడ చూసినా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి, వనపర్తి నాగర్ కర్నూల్ జిల్లాలలో తోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ పండుగను హిందూ మహిళలోకం అత్యంత ఘనంగా జరుపుకోవడం విశేషం,



## సిగ్నల్ కాలనీలో స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న

### మున్సిపల్ కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్




మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని సిగ్నల్ కాలనీ ఆర్-బి ఆఫీస్ రోడ్ లో మానుకోట మున్సిపాలిటీలో స్థానిక 26 వ వార్డు కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం జరిగింది. ఈ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో వార్డ్ ఆఫసర్ జ్యోతి, బిల్ కలెక్టర్ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు చేపూరి, సరిత, పెరుగు వరలక్ష్మి, ఆర్పీ లు సెగ్గెం,సరిత, సుశీల, మైల పద్మ, 26 వ వార్డు, సిగ్నల్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఇక నుండి ఏటీఎం లో రేషన్ బియ్యం



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): ఏటీఎం నుంచి నగదు డబ్బులు తీసుకోవటం మీరు చూసిఉంటారు. కానీ, ఇప్పుడు ఏటీఎం నుంచి రేషన్ బియ్యం కూడా తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి దేశంలోనే తొలి బియ్యం ఏటీఎం మిషన్ ప్రారంభ మైంది. ఒడిశాలో ఏర్పాటు చేసిన ఈ ఏటీఎం మిషన్ నుంచి బియ్యాన్ని తీసుకో వచ్చు. వినడానికి వింతగా అనిపించినా ఇది నిజం. ఒడిశా ప్రభుత్వం భువ నేశ్వర్ లోని ముంచేశ్వర్ ప్రాంతంలోని గోదాములో ఈ నూతన బియ్యం ఏటీఎంను ప్రారంభించింది. రేషన్ లబ్ధిదారులు తమ రేషన్ కార్డు నెంబర్ ను బియ్యం ఏటీఎం స్కీరన్ పై నమోదు చేయాలి. ఆ తరువాత వేలిముంద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఏటీఎం నుంచి వచ్చే బియ్యాన్ని బస్తాలో నింపుకోవచ్చు. ప్రతీ రేషన్ కార్డు లబ్ధిదారుడు ఏటీఎం ద్వారా ఒకేసారి 25 కిలోల బియ్యాన్ని పొందవచ్చు. ఈ విధానం ద్వారా బియ్యం కోసం రేషన్ దుకాణాల ముందు గంటల తరబడి నిలబడాల్సిన అవసరం ఉండదు. అంతేకాక అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ప్రయోగాత్మకంగా భువనే శ్వర్ లో ఈ బియ్యం ఏటీఎంను ప్రారంభించారు. ఒడిశాలోని మొత్తం 30 జిల్లాల్లో ఈ రేషన్ బియ్యం ఏటీఎంలను తెరిచే యోచన లో ప్రభుత్వం ఉంది. ప్రస్తు తం ఈ మోడల్ విజయ వంతం అయితే.. రేషన్ కార్డు పథకం కింద ఇతర రాష్ట్రాలకు ఈ విధానం విస్తరించనుంది.

## ఎస్ డీఎఫ్ పనులను పరిశీలించిన
# డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి



ఖానాపురం ,(గౌతమ్ న్యూస్): ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో ఎస్ డీఎఫ్ నిధులతో చేపట్టిన కస్తూర్బా గాంధీ పాఠశాలలోని టాయిలెట్స్ , అశోక్ నగర్ కోయ కుల సంఘం కమ్యూనిటీ హాల్ పనులను కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గం కన్వీనర్ ,వరంగల్ డిసిసి అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ డీఎఫ్ నిధులు అశోక్ నగర్ గ్రామానికి కేటాయించినందుకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జరుగుతున్న పనులను త్వరితిగతిన పూర్తి చేయాలని ఎఈ ని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమలో ఎఈపనితేజ్ గా , రఘు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టి సారంగపాణి ,మాజీ వార్డ్ మెంబర్ పొనుగోటి ప్రవీణ్ రావు ,ఈసం నర్సయ్య వజ్జ శ్రవణ్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్ది శ్రీనువాస్ , అయోధ్యనగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్ల యాకయ్య ,కర్ల రాజేందర్ ,పేండ్లి రాజు ,బొంపెల్లి అనిల్ , తదితరులు పాల్గొన్నారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం



వరంగల్ (గౌతమ్ న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ములుగు రోడ్డు , పెద్దమ్మగడ్డ , హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.డి యాకూబ్ పుట్టినరోజు సందర్భంగా జుబేదా , అన్ను , ఆశ సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 331వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జుబేదా , అన్ను , ఆశ , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెళ్ళి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు .

## ధర్మారావుపేట పాఠశాలలో స్వచ్ఛధనం -పచ్ఛదనం






ఖానాపురం(గౌతమ్ న్యూస్): ఖానాపురం మండలం ధర్మరావుపేట హైస్కూల్ నందు శు క్రవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ ఎం మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.వర్షా కాలంలో మన ఇంటి చుట్టూ మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సమాజంలో ఒక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో హెచ్ ఎం వరణ్ సింగ్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయత్ కార్యదర్శి అనిత, ఎపిఓ సునిత,డాక్టర్ సునితదేవి అంగన్ వాడీ టీచర్లు, ఆశవర్కర్లు ,తదితరులు పాల్గొన్నారు.

## పాఖాల మత్తడిని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఖానాపురం ,(గౌతమ్ న్యూస్): ఖానాపురం మండలవ్యవసాయానికి ఆయువుపట్టు పాఖాల సరస్సు మత్తడి పోస్తున్న సందర్భంగా.. ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మతల్లికి హారతినిచ్చి, పాఖాల ఆయకట్టు రైతులు సంవృద్దిగా పంటలు పండించి, ఖానాపూర్ మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ బాధ్యులు పలువురు పాల్గొన్నారు.

# జీవకోటి మునుగడకు మొక్కలే ఆధారం: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



నర్సంపేట/వరంగల్ (గౌతమ్ న్యూస్): జీవకోటి మునుగడకు మొక్కలే ఆధారమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నర్సంపేట మండలంలోని లక్నపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో వనమహోత్సవంలో ఉపాధ్యాయులు అధికారులు విద్యార్థులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థి జన్మదినం సందర్భంగా మొక్కను విద్యార్థిచే నాటించి, నాటిన



మొక్కలను బాధ్యతతొ సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతనం పచ్ఛదనంపై నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో గత ఐదు రోజులుగా పచ్చదనం స్వచ్ఛతను కార్యక్రమంలో చేసిన స్వచ్ఛత పనుల గురించి కలెక్టర్ ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛందనం పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించి తమ గృహాలను పరిసరాలను గ్రామాలను నీరు నిల్వ ఉండకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా శుభ్రంగా ఉంచుకొని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం లక్నేపల్లి గ్రామపంచాయతీ లో గల అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడి సెంటర్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జిల్లా బీసీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు గ్రామస్తులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బడా కార్పొరేట్ దోపిడిదారులారా దేశం వదిలి వెళ్లిపోండి

## వ్యవసాయ రంగాన్ని కార్మిక చట్టాలను దేశ సంపదను కాపాడుకుందాం


## రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



వరంగల్ (గౌతమ్ న్యూస్): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈరోజు క్విట్ ఇండియా డే సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, మరియు కార్మిక సంఘాల జాతీయ సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో కార్మిక రైతు సంఘాల నాయకులు ధర్నా చేసి నిరసన తెలియజేశారు. దాదాపు అరగంట సేపు జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి , కార్మిక సంఘ నాయకులు గంగుల దయాకర్ అధ్యక్ష వహించగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2018 సంవత్సరం నుండి రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని ఫలితంగా వారు హక్కులు ఉపాధి కోల్పోతున్నారని వారు అన్నారు .దేశవ్యాప్తంగా జరిగిన రైతు, ఉద్యమానికి తలోగ్గి నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని రైతు వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదని వారు విమర్శించారు.44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్లు గా మార్చి కార్మిక హక్కులను , హరించిందని ఈ దేశ బడా కార్పొరేట్ దోపిడీదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నదని, విదేశీ కార్పొరేట్ శక్తులకు పన్ను రాయితీని ఇస్తున్నదని వారు మండిపడ్డారు.వ్యవసాయ పరిశోధనలకు అమెజాన్, సిన్జెంటా, బేయర్ లాంటి సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ కార్మిక రైతు సంఘాల నాయకులు సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు గన్నారపు రమేష్ ముక్కెర రామస్వామి నర్రా ప్రతాప్ గోనే కుమార స్వామి సాగర్ దామెర కృష్ణ బాబురావు ఐలయ్య ఎండి ఇస్మాయిల్ రవి యాదవ్ ఇనుముల శ్రీను ఓదెల రాజయ్య దామెర కృష్ణ రాజనర్సయ్య ఎండి యాకూబ్ బరపటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థను నమ్మి చతికిలబడ్డ చేనేత

ప్రభుత్వం సుమారు ఏడు దశాబ్దాలు సహకార రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి, చేనేత పరిశ్రమకు సహాయపడాలని ఆలోచించింది. కానీ సహకారరంగ ప్రోత్సాహం వల్ల చేనేత పరిశ్రమకు జరగవలసినంత మేలు జరగలేదు. మొత్తం చేనేత పరిశ్రమలో సహకార నేత కార్మికులు చాలా తక్కువ. నాలుగవ ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సెన్సస్ 2019-20 ఫలితాల ప్రకారం, దేశంలోని 35.22 లక్షల మంది చేనేత కార్మికులలో... సహకార సంఘాల కార్మికులు కేవలం 6.3 శాతం (2.23 లక్షలు) మాత్రమే. పైగా, సహకార వ్యవస్థలో బోగస్ సంఘాలు, పేలవంగా నడిచే సంఘాలే ఎక్కువ. వీటివల్ల చేనేత పరిశ్రమకు ఒరిగింది తక్కువే. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లోని కొన్ని చేనేత సహకార సంఘాలు తమ కార్యకలాపాలను చక్కగా నిర్వహించడం వల్ల, సభ్యులు వాటిని వదలడానికి ఇష్టపడడం లేదు. సభ్యులకు నిరంతరం పని కల్పించడం, ఆకర్షణీయమైన వేతనాలు, బోనస్‌లు, ప్రభుత్వ పొదుపు నిధికి చెల్లింపులు, డిజైన్ అభివృద్ధికి చెల్లింపులు, ఇతర ప్రోత్సాహకాలు అందించడం దీనికి కారణాలు. సక్రమంగా నడిచే సంఘాల వల్ల మంచి మేలు జరుగుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఏది ఏమైనా భారతదేశంలోని చేనేత పరిశ్రమలో సహకార రంగానికి వెలుపల ఉన్న చేనేత కళాకారులను వదిలి, సహకార రంగంలోని కార్మికులకే ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాలన్న ప్రభుత్వ విధానం దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగిన ఆర్థిక తప్పిదం. సహకార సంఘాలు సిద్ధాంతపరంగా మంచివే అయినా, ఆచరణపరంగా చాలావరకు నిరుపయోగమైనవి. 2023లో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వారు తెలుగు రాష్ట్రాల్లోని నేత కార్మికులపై చేసిన అధ్యయనం వంటి అనేక అధ్యయనాల్లో బోగస్ సంఘాలు కుక్క గొడుగుల్లా వెలిశాయనీ, సహకార సంఘాలు చాలా వరకు ఉపయోగం లేనివనీ ఢంకా బజాయించి చెప్పాయి. ఈ సొసైటీలు చాలా వరకూ నిద్రాణంగా ఉంటాయి. నిధులను స్వాహా చేయడం తప్ప, ఇవి తమ సభ్యులకు తగినంత పనిని అందించడం లేదు. చాలా బోగస్ సంఘాల ఉనికి కేవలం రికార్డులలోనే ఉంటుంది. ఇదిలా ఉండగా, నిజానికి చట్టబద్ధమైన సొసైటీలు కూడా ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి. అవి కూడా సభ్యులకు చాలినంత ఉపాధి కల్పించడం లేదు. అవి ఇచ్చే నేత కూలి కూడా చాలా తక్కువ. అపెక్స్ సొసైటీల కొనుగోళ్లపైనే అవి ఎక్కువగా ఆధారపడుతున్నాయి. బోగస్ సంఘాల స్థాపన, వాటి తదుపరి కార్యకలాపాలపై ప్రభుత్వ యంత్రాంగం సరైన నియంత్రణను సాధించలేకపోయింది. చాలా చోట్ల సంఘాల సభ్యులకు తామెందుకు సభ్యులయ్యారో వారికి



తెలియదు. ప్రభుత్వం అందించే సహాయాన్ని ఈ నకిలీ సంఘాల మాఫియా కాజేస్తున్నదని తెలుసుకున్న ప్రభుత్వం, చేనేతకు తగిన బడ్జెట్ తోడ్పాటు అందించడానికి వెనుకాడుతోంది. వాస్తవానికి, సహకార సంఘాల మాఫియాను దాని ప్రారంభ దశలోనే ప్రభుత్వం అరికట్టగలిగి ఉంటే, ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న సహకార సంఘ వ్యవస్థ, చేనేత పరిశ్రమపై గణనీయమైన ప్రభావాన్ని చూపేది. ఏది ఏమైనా సహకార వ్యవస్థ నిరాశనే మిగిల్చింది. కాబట్టి ప్రభుత్వం సహకార వ్యవస్థపై ఆధారపడి అభివృద్ధి నిధులను అందించే పద్ధతిని సమీక్షించుకోవాలి. చేనేత పరిశ్రమ క్షీణదశలో ఉందనడానికి అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ఇది గతంలో వ్యవసాయం తర్వాత రెండవ అతిపెద్ద ఉద్యోగప్రదాయిని. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అఖిల భారత చేనేత జనాభా లెక్కల ప్రకారం 2010లో 43.32 లక్షల మంది ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2019-20 నాటికి 35.22 లక్షలకు తగ్గింది. సహకార సంఘాలలో కార్యశీలక కార్మికుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. అంతేకాకుండా, మాస్టర్ వీవర్లు తీవ్ర కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నారు. చాలా మగ్గాలు అటకెక్కి బూజు పట్టాయి. 2010లో సగటు పనిదినాలు 234 ఉంటే, 2020లో అవి 207కి పడిపోయాయి. అధిక విలువ ఉత్పత్తులను తయారుచేసే పోచంపల్లి, గద్వాల్, ధర్మవరం, ఉప్పాడ వంటి చిన్న పాకెట్స్ మినహా సంప్రదాయ నేత కులాలలోని యువతను చేనేత పరిశ్రమ ఆకర్షించడం లేదు. ఈ ప్రాంతాలలో సంప్రదాయ చేనేత కులాల యువకులు, నూతన శక వృత్తి ఉద్యోగాలలో నిరాశ కలిగినప్పుడు రావడానికి పనికివచ్చే ప్రత్యామ్నాయ వృత్తిగా చేనేతని భావిస్తున్నారు. నేటి మార్కెట్‌లో లభిస్తున్న ఉద్యోగాలకు వృద్ధ కార్మికుల ప్రతిభ సరిపోదు కాబట్టి వారే ఎక్కువగా ఈ వృత్తిలో ఉన్నారు. వయసు పైబడిన నేత కార్మికులు అత్యాధునికమైన మగ్గాలతో పని చేయలేకపోతున్నారు. అంతేకాకుండా, వారు అధిక నాణ్యత గల డిజైన్లను తయారు చేయలేరు. పైగా, చేనేతరంగం చాలా తక్కువ వేతనాలను అందిస్తోంది. ఎంత తక్కువ అంటే రిటైల్ అమ్మకాలు, కార్యాలయ నిర్వహణ, అకౌంటింగ్, నిర్మాణం వంటి సమకాలీన వృత్తులలో వచ్చే వేతనాలలో సగం కంటే తక్కువ. అయితే, సామాన్య ఉత్పత్తులకు బదులు, ఖరీదైన, ఆధునిక తరహా ఉత్పత్తులను నేయడం వల్ల అధిక వేతనాలు లభిస్తాయి. కానీ అధిక విలువగల వస్త్ర ఉత్పత్తి చేసే చేనేత పనిలో కూడా ఇబ్బందులున్నాయి. వీటిలో నూతన డిజైన్ సెటప్‌కు ఖర్చు అధికం. పైగా ఈ ఖర్చు ఎక్కువ భాగం చేనేత కార్మికుని నెత్తిపైనే పడుతుంది. మరింత డిజైన్-ఇంటెన్సివ్ ఉత్పత్తులకు మారడానికి వృద్ధ కార్మికులకు చేతకాదుబీ నూతన డిజైన్లు నేయగల యువకులు ఈ వృత్తిలోకి రావడానికి విముఖంగా ఉన్నారుబీ నూతన డిజైన్లను నేసే నైపుణ్యాలను సంపాదించడం, వాటిని బదిలీ చేయడం ఇబ్బందులతో కూడుకున్న పనిబీ అలాగే అనేక రకాల డిజైన్లు, నమూనాలు కావాల్సినంతగా లభ్యం కావడం లేదు. అధిక విలువ వస్త్రాలను నేయడంలో ఉన్న సమస్యలతో పాటు, చేనేత కార్మికులు అనేక ఇతర వ్యవస్థాగత ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నిత్యమూ పెరిగే నూలు, రంగు, రసాయనాల ధరలు, చేనేత కార్మికులకు తమ వస్తు నాణ్యతపై నియంత్రణ లేకపోవడం, అనుకరణలను ఉత్పత్తి చేసే పవర్‌లూమ్‌ల దాడి, వినియోగదారుల అవసరాలను తెలిపే సమాచార వ్యవస్థలు లేకపోవడం, కొనుగోలుదారులతోనూ, రిటైల్ వర్తకులతో బలమైన సంబంధాలు లేకపోవడం వంటివి ఉన్నాయి. ఈ సవాళ్లతో పాటుగా, మార్కెట్‌లో అమ్ముకోవడాన్ని కష్టతరం చేసే విధంగా చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టి విధిస్తున్నారు. చేనేతకు ప్రత్యేకించిన నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తిని పరిమితం చేసే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయకపోవడం, ప్రభుత్వం చేనేత అభివృద్ధికి ఇచ్చే బడ్జెట్‌ని ప్రతి ఏటా తగ్గించడం చేనేతను పీడిస్తున్న సమస్యలు. ఈ సమస్యలన్నీ సహకార రంగంలోని పరిశ్రమకూ, దానికి బయట ఉన్న మాస్టర్ వీవర్లు, స్వతంత్ర నేత కార్మికులకూ వర్తిస్తాయి. చేనేత పరిశ్రమ అభివృద్ధిని పట్టించుకోవాలంటే, ప్రభుత్వం ఇప్పుడు సహకారేతర చేనేత కార్మికులకు, ముఖ్యంగా మాస్టర్ వీవర్లకు, స్వతంత్ర కార్మికులకు గణనీయమైన సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉంది. కానీ మాస్టర్ వీవర్లు, స్వతంత్ర వీవర్లు ప్రభుత్వ సహాయాన్ని దారి మళ్లించే అవకాశం ఉంది. అటువంటి ధోరణిని అరికట్టడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, జియోట్యాగింగ్, బలమైన వ్యక్తిగత గుర్తింపు వ్యవస్థ, ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)ని ఉపయోగించుకునే వ్యవస్థలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలి.

# నీట్-పీజీ వాయిదా వేయలేం

## విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టలేం

## పిటిషన్‌ను తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.ఈ నెల 11న జరగనున్న ఈ పరీక్షకు పలువురు అభ్యర్థులకు దూరప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని పేర్కొంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం



తిరస్కరించింది. 'ఇలాంటి పరీక్షను మేము ఎలా వాయిదా వేయగలం. ఈ రోజుల్లో కొందరు కేవలం పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ వస్తున్నారు. మేము విద్యా సంబంధ నిపుణులం కాదు. ఈ పరీక్ష షెడ్యూల్‌ను మార్చలేం. పరీక్షను వాయిదా వేస్తే వారాంతంలో రెండు లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షల మంది తల్లిదండ్రులు రోదించాల్సి వస్తుంది. ఇంతమంది అభ్యర్థుల కెరీర్‌ను ప్రమాదంలో పెట్టలేం. ఈ పిటిషన్ల వెనుక ఎవరున్నారో మాకు తెలియదు' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, ఈ పరీక్ష జూన్ 23న జరగాల్సి ఉండగా, పోటీ పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర వైద్య శాఖ పరీక్షను వాయిదా వేసింది.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం 25 వేలు..!



ఆగస్టు 15.. మన స్వాతంత్ర్య దినోత్సవం దగ్గరకు వస్తున్న నేపథ్యంలో గ్రామగ్రామాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధుల పెంచినట్లు తెలిపారు. ఆగస్టు 15 కార్యక్రమాలకు రూ.100, రూ.250 ఇచ్చే మొత్తాలను రూ.10 వేలు, రూ.25 వేలకు పెంచాం. కాబట్టి ప్రతీ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి. ఇప్పటి వరకూ మైనర్ పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇచ్చేవారు. ఇప్పుడు ఆ మొత్తాలను రూ.10 వేలు, రూ.25 వేలు చేటశాం. జనవరి 26న గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలకు ఇదే విధంగా రూ.10 వేలు, రూ.25 వేలు చొప్పున నిధులు అందిస్తాం. అదే విధంగా పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత చెప్పాలి. పారిశుధ్యంపై మహాత్మా గాంధీజీ చెప్పిన మాటలతో ప్రమాణం చేయించాలి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## వచ్చే ఐదు ఏళ్ళు రాష్ట్రంలో బ్లాక్ డేనే..!



చంద్రబాబు నైజం మరోసారి బయట పడింది. కౌంటింగ్ జరిగిన మధ్యానం నుండి చంద్రబాబు ఆయన గుండాలు వరుసగా దాడులు,చేయటం మొదలు పెట్టారు అని మాజీ ఎంపీ నందిగం సురేష్ అన్నారు. ప్రభుత్వ ఆస్తులు నాశనం చేయడం, మహిళల పై దాడులు, అరాచకాలు చేస్తున్నారు. ఇవన్నీ పక్కదారి పట్టించేందుకు అంబేద్కర్ విగ్రహం పై దాడులకు ప్రయత్నం చేస్తున్నారు అని నందిగం సురేష్ పేర్కొన్నారు. విజయవాడలో జగన్ అంబెద్కర్ విగ్రహం పెట్టిన నాటి నుండి టీడీపీ నేతలు అక్కసు కక్కుతూనే ఉన్నారు. అప్పుడు బడాయి హామీలు ఇచ్చి నోటికొచ్చినట్లుగా మాట్లాడారు. కానీ అనవసర హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయను అని జగన్ ఎప్పుడో చెప్పారు. కానీ ఇప్పుడు అంబేద్కర్ ని కించపరిచే విదంగా జరుగుతున్న ప్రయత్నాలు అడ్డుకుంటాం. నిన్న రాత్రి నుండి వచ్చే ఐదు ఏళ్ళు రాష్ట్రంలో బ్లాక్ డేనే. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూస్తాం.. అవసరం అయితే న్యాయస్థానంని కూడా ఆశ్రయిస్తాం అని నందిగం సురేష్ తెలిపారు.

## ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కాషాయ నేతల కుట్ర



కాంగ్రెస్ జన్ ఆందోళన యాత్రలో భాగంగా మైసూర్ వేదికగా కర్నాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం బీజేపీ, జేడీఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. రాజ్‌భవన్ కేంద్రంగా వారు (బీజేపీ-జేడీఎస్) తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆరోపించారు. తనకు భూమి కేటాయించాలని తాను తన పలుకుబడిని ఉపయోగించానని బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారని అన్నారు. మీ హయాంలోనే మీరు నాకు భూమి కేటాయిస్తే అది నా తప్పెలా అవుతుందని సిద్ధరామయ్య కాషాయ నేతలను ప్రశ్నించారు. తన ప్రతిష్టను దెబ్బతీసి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని అన్ని రకాలుగా బీజేపీ, జేడీఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్‌లో ఎలాంటి అవినీతి లేదని తాను చెప్పడం లేదని స్పష్టం చేశారు. కొందరు అవినీతి అధికారులు, బ్యాంక్ అధికారులను ఈ స్కామ్‌లో ప్రమేయం ఉన్నట్టు గుర్తించి రూ. 87 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. ఈ కేసులో చార్జిషీట్ కూడా దాఖలైందని చెప్పారు. పోక్సో కేసులో మాజీ సీఎం యడియూరప్పపై చార్జిషీట్ నమోదైందని, ఆయన రాజకీయాల నుంచి తప్పుకోవాలని సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. ఆయన రాజకీయాల్లో కొనసాగేందుకు నైతిక హక్కు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. యడియూరప్ప కుమారుడు విజయేంద్ర ఎన్నో స్కామ్‌ల్లో కూరుకుపోయారని సిద్ధరామయ్య ఆరోపించారు.

## కేంద్ర బలగాలతో అంబేద్కర్ విగ్రహంకు భద్రత కల్పించాలి..!




అంబేద్కర్ విగ్రహంపై దాడి ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. టీడీపీ ప్రభుత్వం హయంలో అంబేద్కర్ విగ్రహం పెట్టమని అడిగితే దాడులు చేశారు, కేసులు పెట్టారు. అంబేద్కర్ విగ్రహంని ఎక్కడో ముళ్ల పొదల్లో పెట్టేందుకు ప్రయత్నం జరిగింది. కానీ 400కోట్లు కు పైగా ఖర్చు చేసి జగన్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. కానీ గవర్నర్ బంగ్లా, పోలీసు కమిషనర్ కార్యాలయం పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహం పై గునపలు, ఇనుప రాడ్ల తో దాడి చేశారు. కాబట్టి అంబేద్కర్ విగ్రహం ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ విగ్రహంని కులదోసే ప్రయత్నం కూడా జరగవచ్చు. ఈ ఘటనకి చంద్రబాబు బాధ్యత వహించాలి. జగన్ కు పేరు వస్తుందనే టీడీపీ నాయకులు ఇలాంటి కుట్రలు చేస్తున్నారు. అయితే అంబేద్కర్ విగ్రహం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పై నమ్మకం లేదు.. వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబు కు అలవాటు. కాబట్టి కేంద్ర బలగాలతో అంబేద్కర్ విగ్రహంకు భద్రత కల్పించాలి అని మేరుగ నాగార్జున పేర్కొన్నారు.

## యూపీఐ చెల్లింపుల్లో మార్పులు





యూపీఐ లావాదేవీల్లో ఆర్బీఐ కీలక మార్పులు చేసింది. ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలను వెల్లడించే సమ యంలో ఆర్బీఐ గవర్నర్ యూపీఐ చెల్లింపుల్లో తీసుకు వచ్చిన మార్పులను వెల్లడించారు. యూపీఐ చేసే ద్వారా పన్ను చెల్లింపుల పరిమితిని పెంచుతున్నట్లు శక్తికాంతదాస్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న లక్ష రూపాయలుగా ఉన్న ఈ పరిమితిని 5 లక్షల రూపాయలకు పెంచారు. ఫలితంగా ఆదాయ పన్ను, ఆస్తిపన్ను, మందుస్తు పన్ను చెల్లింపులు చేసే వారు ఒక లావాదేవీలో 5 లక్షల వరకు చెల్లించే అకాశం కలుగుతుంది. యూపీఐ చెల్లింపుల పరిమితిని ఆర్బీఐ గతంలోనూ పలు సడలింపులు ఇచ్చింది. 2023 డిసెంబర్లో వైద్య ఖర్చు, విద్యా సంస్థల్లో ఫీజులను యూపీఐ ద్వారా 5 లక్షల వరకు చెల్లించే వెసులుబాటు కల్పించింది. అంతకు ముందు క్యాపిటల్ మార్కెట్లు, బీమా, విదేశాల నుంచి వచ్చే రెమిటెన్సు చెల్లింపుల పరిమితిని కూడా 2 లక్షలకు పెంచింది. ఐపీఓల్లో పెట్టుబడి, రిటైల్ డైరెక్స్ స్కీమ్ ల్లోనూ యూపీఐ ద్వారా 5 లక్షల వరకు చెల్లించే అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు లక్షకు మించి పన్ను చెల్లించాల్సి వచ్చిన వారు క్రెడిట్, డెబిట్ కార్డులను వాడేవారు. లేదంటే బ్యాంకు వెళ్లి చేసేవారు. కార్డుల ద్వారా అయితే సీవీవీ, ఎక్స్ పైరీ తేదీ సహా ఇతర వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం ఓటీపీతో ధ్రువీకరించాలి. కార్డులపై ఉన్న నిబంధనల ప్రకారం కొన్ని రకాల రుసుములు కూడా చెల్లించాల్సి ఉంటుంది. యూపీఐ చెల్లింపుల్లో ఇలాంటి ఇబ్బందులు ఉండవు. పిన్ నెంబర్ ఎంటర్ చేసి చెల్లింపులు పూర్తి చేయవచ్చు.

# మధ్య ప్రాచ్యంలో ఆయుధ మోహరింపు!



ఇజ్రాయిల్ దాని దుర్మార్గాలకు నిస్సిగ్గుగా వత్తాసు పలకటమే కాదు, సాయుధ రక్షణకు నౌకా, వైమానిక దళాలను రప్పిస్తూ ఆయుధాలను తరలిస్తున్న అమెరికా చర్యలతో మధ్య ప్రాచ్యంలో ఎప్పుడైనా ప్రాంతీయయుద్ధం తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది.ఈ దుష్ట కూటమిని ఎదుర్కొనేందుకు ఇరాన్ దానికి మద్దతుగా ఉన్న సాయుధశక్తులు కూడా సిద్ధంగాక తప్పని స్థితి. హమాస్ నేత హనీయేను ఇరాన్ గడ్డమీద, హిజబుల్లా కమాండర్ ఫాద్ షుకుర్ను లెబనాన్లో హత్య కావించటం రెచ్చగొట్టే కుట్రలో భాగం తప్ప మరొకటి కాదు. దానికి తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, హిజబుల్లా ప్రకటించింది. తమ మీద దాడి చేసి పౌరులను హతమార్చిన హమాస్ సాయుధులను అణచివేసి కొద్ది గంటల్లోనే బంధీలుగా ఉన్న తమవారిని విడిపించుకు పోతామని ఇజ్రాయిల్ ప్రకటించి పది నెలలు దాటింది. రోజు రోజుకూ ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న నిరాయుధుల మీద మారణ కాండ సాగించటం తప్ప హమాస్ సాయుధులను పట్టుకున్న జాడలేదు. 'ఒక వీరుడు మరణిస్తే ఉద్భవింతురు వేయిమంది' అన్నట్లుగా కొంత మంది హమాస్ నేతలను హతమార్చినా నాయకులు పుట్టుకువస్తూనే ఉన్నారు. హనియే హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించినప్పటి నుంచి మధ్యధరా సముద్రం, ఎర్ర సముద్రం ప్రాంతాల్లోకి అమెరికా విమానవాహక యుద్ధ నౌకలు, ఖండాంతర క్షిపణులను ప్రయోగించే ఆధునిక యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లను పెద్దఎత్తున తరలిస్తున్నది. అందువలన ఇరాన్ కూడా తన జాగ్రత్తల్లో తానుంది. రక్షణరంగంతో సహా గతంలో రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు ఆయుధాలు, రక్షణ వ్యవస్థలను దిగుమతి చేసుకుంటున్నది. గతంలో ఇరాన్కు అందచేసిన రక్షణ వ్యవస్థలను ఇజ్రాయిల్ వమ్ము చేసిందని, మరోసారి వాటిని ఇచ్చి ఎందుకు పరువును ఫణంగా పెట్టుకుంటారంటూ పశ్చిమ దేశాల వ్యాఖ్యాతలు కొందరు రష్యా మంచిని కోరుకుంటున్నట్లు ఫోజు పెడుతున్నారు. పదినెలలైనా హమాస్ను పట్టుకోలేక పసిపిల్లల ను, మహిళల మీద ప్రతాపం చూపుతున్నారు. వారికి తానతందానా అంటు న్నారు సిగ్గులేదా, మానవత్త కబుర్లు చెబుతున్నారు, మీకేం పోయేకాలం వచ్చిందని అదే వ్యాఖ్యాతలు ఇజ్రాయిల్కు, అమెరికాకు ఎందుకు గడ్డిపెట్టటం లేదు.పాలస్తీనాపౌరుల న్యాయమైన డిమాండ్లకు గతంలో మద్దతిచ్చిన కొన్ని ఇరుగుపొరుగు దేశాలు మధ్యలో వదిలేసి అమెరికా చంకనెక్కి ఇజ్రాయిల్తో యుగళగీతాలు పాడుతున్నప్పటికీ మాతృభూమి కాంక్ష తగ్గలేదు. యూదు దురహంకారులు, మిలిటరీ దాడుల మధ్య పుట్టి పెరుగుతున్న వారికి శాంతియుత పరిస్థితి అంటే ఎలా ఉంటుందో తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆత్మగౌరవంతో మాతృభూమిలో బతకటమా లేక వీరమరణం పొందటమా అన్నదే తప్ప వారికి మరొకటి తెలియదు. గాజాలో తమ పిల్లలు, మహిళలను హతమారుస్తున్నా, నివాసాలను నేలమట్టం గావిస్తున్నా వెన్ను చూపటం లేదు, వెనక్కు తగ్గటం లేదు.తమ నేతలు కొందరిని దొంగదెబ్బతీసి చంపినా పిరికిబారటం లేదు. పాలస్తీనా మహత్తర లక్ష్యం కోసం పోరాడుతున్నవారికి మద్దతుగా ఉన్న ఇరాన్ మీద, దానికి వెన్నుదన్నుగా ఉంటున్న రష్యా మీద పశ్చిమదేశాలు ఏదో ఒకసాకుతో ఆంక్షలు అమలు చేస్తున్నప్పటికీ అవి వెంట్రుకతో సమానమన్నట్లుగా ఆ దేశాల నేతలు ముందుకు పోతున్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దగ్గర ఆధునిక ఆయుధాలు ఉండవచ్చు. గాజాలో హమాస్ దాదాపు ఆరువందల కిలోమీటర్ల మేర సొరంగాలు తవ్వుతున్నా, నలభైవేల మంది విముక్తి యోధులను తయారు చేస్తున్నా పసిగట్టలేకపోయారు. ఆ సొరంగాల్లో బందీలుగా ఉన్న తమ వారి ఆచూకీ కనుగొనేందుకు అవేమీ పనికిరాలేదు. తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడు వస్తాడు. గాజా, లెబనాన్, ఎమెన్ వైపుల నుంచి ఒకేసారి పాలస్తీనా మద్దతుదారులు దాడులకు దిగితే తమ పరిస్థితి ఏమిటని ఇజ్రాయిల్ సాధారణ పౌరులు కూడా నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. దానికి నెతన్యాహు ఆ నరరూపరాక్షసుడికి మద్దతు ఇస్తూ కొట్టండి, చంపండి అంటున్న జో బైడెన్ వంటి అపరమానవతావాదులు తప్ప మరొకరు కాదు. అందువలన ఇజ్రాయిలీలు కూడా తమ మిలిటరీ జరుపుతున్న దారుణాలను ఖండించాల్సిన అవసరం ఉంది. మధ్య ప్రాచ్యంలో మంటలు చెలరేగితే వాటికి వారూ మాడి మసికావాల్సిందేనని గుర్తించటం అవసరం.

# అణ్వాయుధ రహిత దారిలో....




ప్రపంచాన్ని వణికించిన అణుబాంబుదాడి జరిగి 79 సంవత్సరాలు గడిచాయి. 1945 ఆగస్టు ఆరున హిరోషిమా, తొమ్మిదిన నాగసాకిలలో చోటుచేసుకున్న అణువిస్ఫోటన ప్రభావం మానవాళిని ఇంకా వెంటాడుతూనే ఉంది. పోయిన ప్రాణాలకు, తెగిపడిన శరీర అవయవాలకు లెక్కేలేదు. ప్రాణాలతో బయటపడిన వారిని అణుధార్మిక శక్తి జీవచ్ఛవాలుగా మార్చివేసింది. ఇప్పుడు పుడుతున్న చిన్నారులనుసైతం ఆ రక్కసి వెంటాడుతోంది. ఇదంతా ఒక ఎత్తైతే, ఈ బాంబు దాడితో ప్రపంచాన్ని అణుప్రమాదం ముప్పు ముందుకు సామ్రాజ్యవాద అమెరికా తోసింది. అప్పుడు ప్రారంభమైన అణ్వాయుధ పోటీ ఇప్పటికీ కొనసాగుతోంది. అణుబాంబు సృష్టించే వినాశనం తెలిసినిప్పటికీ ఆత్మరక్షణ కోసం ఆ బాటనే నడవక తప్పని స్థితి అనేక దేశాలదీ! కొన్నిదేశాలు చెప్పి అణు ప్రయోగాలు చేస్తున్నాయి. మరికొన్ని చెప్పకుండా ఆ పనికానిస్తున్నాయి. అధికారికంగా అణ్వాయుధ దేశాలుగా కొన్ని గుర్తింపు పొందితే, ఆ గుర్తింపు కోసం తహతహలాడుతున్న దేశాలు మరికొన్ని! గుర్తింపు ఉన్నా, లేకపోయినా అ ఆయుధం తమ చెంత ఉంటే చాలనుకునే దేశాలు ఇంకొన్ని..! తన స్వార్థం కోసం, ప్రపంచ ఆధిపత్యంకోసం మొత్తం భూగోళాన్ని అశాంతిలోకి ఉద్రిక్తతల్లోకి తోసివేసిన అమెరికా వైఖరిలో ఇప్పటికీ మార్పు లేకపోవడమే ఆందోళనకరం! ఇప్పటికీ అణుకుంపటిని రగిలిస్తూ, యుద్ధాలు రెచ్చగొడుతూ, దేశాల మధ్య కుట్రలు చేస్తూ ఆయుధ వ్యాపారాన్ని విచ్చల విడిగా ఆ దేశం చేస్తూనే ఉంది. కళ్లముందు కనపడుతున్న ఇజ్రాయిల్ అమానుష దాడితో పాటు, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో రగిలిస్తున్న ఉద్రిక్తతలే దీనికి నిదర్శనం. ఈ పరిస్థితుల్లో అణ్వాయుధ రహిత ప్రపంచ లక్ష్య సాధన సాధ్యమవుతుంది ఆ దారిలో ఉన్న ఆటంకాలేవి? 2013వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం హిరోషిమాలో 'హిరోషిమా రౌండ్ టేబుల్ సమావేశం' నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి పరిమితసంఖ్యలో అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అణు శాస్త్రవేత్తలు, అణు వ్యూహ నిపుణులు హాజరవుతారు. అణుఆయుధాలను నిర్మూలించడం ద్వారా హిరోషిమా ప్రపంచ శాంతి ప్రణాళికకు మద్దతు ఇవ్వడం ఈ రౌండ్‌టేబుల్ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం. దీనిలో భాగంగా 'హిరోషిమా వాచ్ -2024' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో ప్రస్తుత ప్రపంచంలో చోటుచేసుకుంటున్న అణ్వాయుధ పోటీ గురించి, వివిధ దేశాల వైఖరి గురించి అనేక అంశాలను వివరించింది.

### చైనా మార్గం..!

ఎటువంటి పరిస్థితుల్లోనూ అణు ఆయుధాలను మొదటగా తాము ప్రయోగించేది లేదని చైనా ప్రకటించింది. తమ దేశ సార్వభౌమత్వానికి ముప్పు ఎదురైన పరిస్థితుల్లోనూ సాంప్రదాయ ఆయుధాల మీదనే ఆధారపడతామని, తమంతట తాముగా మొట్ట మొదట అణు ఆయుధాలను ప్రయోగించమని ( నో ఫస్ట్ యూజ్) ఆ దేశం స్పష్టం చేసింది. అణు ఆయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) ప్రకారం అణు ఆయుధ దేశాలుగా అధికారికంగా గుర్తింపు పొందిన ఐదు దేశాల్లో ' నో ఫస్ట్ యూజ్' ప్రకటన చేసింది చైనా ఒక్కటేనేనని 'హిరోషిమా వాచ్ -2024' లో పేర్కొన్నారు. అమెరికాతో పాటు, ఈ జాబితాలో ఉన్న బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలు ఈ తరహా ప్రకటన చేయడానికి నిరాకరిస్తున్నాయి. ' అణు యుద్ధం ఎప్పటికీ గెలవదు. ఆ యుద్ధాన్ని ఎన్నడూ చేయకూడదు' అంటూ సంతకాలు చేసిన ఈ దేశాలు 'నో ఫస్ట్ యూజ్' ప్రకటన చేయడానికి మాత్రం నిరాకరిస్తుండటం గమనార్హం. తమ మీద దాడి జరిగినప్పుడు ఏ రకంగానైనా తిప్పి కొట్టే హక్కు తమకు ఉంటుందని ఆ దేశాలు చెబుతున్నాయి. చైనా మాత్రం దీనికి భిన్నమైన వైఖరి తీసుకుంది. అటువంటి సందర్భంలోనూ తమంతట తాముగా మొట్టమొదట అణు ఆయుధాలను ప్రయోగించేది లేదని స్పష్టం చేసింది. ఇటీవలే రష్యా అణు ఆయుధాల వినియోగంపై తమ వైఖరిని మార్చుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. 'అణు వ్యూహాన్ని పున:పరిశీలిస్తాం ఆ దిశలో చర్యలు చేపడతాం.' అని రష్యా ప్రకటించినట్లు నివేదికలో పేర్కొన్నారు. అణు ఆయుధ పోటీకి మూల కారణమైన అమెరికా మాత్రం ఈ దిశలో 'హిరోషిమా శాంతి ప్రణాళిక' చేసిన విజ్ఞప్తిని బేఖాతరు చేసింది. అణు ఆయుధ దేశాలన్నీ ఎన్‌పిటిలో భాగమైనా, కాకపోయినా 'నో ఫస్ట్ యూజ్ ' ప్రకటన చేయాలని, అణు ఆయుధాల తయారీని, వాటిపై ఆధారపడటాన్ని నిలిపివేయాలని హిరోషిమా రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. వివిధ దేశాలు తమ అణు వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటుండటం, 'వ్యూహాత్మకం' పేరిట అణు ఆయుధాల తయారీని కొనసాగిస్తుండటం పట్ల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నిపుణులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

### పెరుగుతున్న ముప్పు!

మరోవైపు అణుముప్పు పెరుగుతోంది. స్టాకహోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిటూట్ (ఎస్ఐపిఆర్ఐ) తాజా నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అణు ఆయుధాల తయారీ, వాటి మోహరింపు పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,121 అణు ఆయధాలు పోగుపడ్డాయి. అణు పోటీకి కారమైన అమెరికా అధికారికంగా ప్రకటించిన లెక్కల ప్రకారం 5,044 అణు ఆయుధాలను కలిగి ఉంది. రష్యా వద్ద 5,580 అణు ఆయుధాలు ఉన్నాయి. పాలస్తీనాపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ వద్ద 90 అణు ఆయుధాలు ఉన్నాయి. చైనాలో 500, భారతదేశంలో 172, పాకిస్తాన్‌లో 170 అణు ఆయుధాలు ప్రయోగానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది. అణు ఆయుధాల మోహరించడం ద్వారా ప్రపంచానికి అణుముప్పును తీవ్రం చేయడంలోనూ అమెరికానే ముందంజలో ఉంది. నాటోలోని అన్ని నాన్ న్యూక్లియర్ దేశాల్లోనూ అమెరికా అణు ఆయుధాలను మోహరిస్తోంది. బ్రిటన్‌లో కూడా ఈ ప్రక్రియను కొనసాగిస్తోంది. అదే సమయంలో నూతన వ్యూహాత్మక న్యూక్లియర్ ఆర్మ్‌డ్ సీ లాంచ్‌డ్ క్రుసైల్ మిసైల్ (ఎస్ఎల్‌సిఎం-ఎన్) అమెరికా తాజాగా రూపొందిస్తోంది. . దీనిని పసిఫిక్ రీజియన్‌లో ఆదేశం వినియోగించనుంది. అదే జరిగితే 1991 తరువాత పసిఫిక్ ప్రాంతంలో ఇది మొదటి అణు మోహరింపు అవుతుంది. అమెరికా చేపడుతున్న ఈ చర్యలు రష్యాపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఫలితంగా కాంప్రహెన్సివ్ న్యూక్లియర్ టెస్ట్ బాన్ ట్రీటీ (సిటిబిటి) నుడి బయటకు వస్తున్నట్లు రష్యా ప్రకటించింది. ఈ ప్రకటనపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తంకావడంతో నూతన వ్యూహాత్మక ఆయుధాల కుదింపు ఒప్పందం ( ది న్యూ స్ట్రాటజిక్ ఆర్మ్స్ రిడక్షన్ ట్రీటీ - న్యూ స్టార్ట్)కు కట్టుబడి ఉంటామని రష్యా తెలిపింది. అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు ప్రపంచవ్యాప్తంగా అణు ఉద్రిక్తతలు పెంచడానికి కారణమౌతోందన్న ఆందోళనను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అణు ఆయుధాలను తయారు చేయడం, మోహరించడాన్ని తక్షణం మానుకోవాలని, అమెరికా-రష్యా దేశాలు 'న్యూ స్టార్ట్' కు కట్టుబడి ఉండాలన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. అణుఆయుధాల నిషేధ ఒప్పందం (టిపిఎన్‌డబ్ల్యు)ను 2017లో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2021 నుండి అ ఒప్పందం అమలులో ఉంది. అయితే, అణ్వాయుధ దేశాల ఆచరణ మాత్రం దానికి భిన్నంగా ఉంది. ఎప్పటికప్పుడు ఈ దేశాలు, ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాలు ఈ ఒప్పందానికి ప్రత్యక్షంగానూ,పరోక్షంగానూ తూట్లు పొడుస్తూనే ఉన్నాయి. అణ్వాయుధ రహిత ప్రపంచపు స్వప్నం నెరవేరాలన్నా, దేశాల మధ్య ఉద్రిక్తతలు సమసిపోయి శాంతి నెలకొల్పాలన్న ఆ దేశాల వైఖరి మారాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య శక్తులు ఆ దేశాలపై ఒత్తిడి తీసుకురావడమే దీనికి మార్గం.

# ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి




ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాల్లో సుమారు 40 కోట్ల మంది ఆదివాసీ ప్రజలు జీవిస్తున్నారు. ఆదివాసీల హక్కులను గుర్తించాలని 1994 ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఐక్యరాజ్యసమితి డిక్లరేషన్ ఆమోదించింది. స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్ళు పూర్తయినప్పటికీ ఆదివాసీల హక్కులు, చట్టాలు, సంస్కృతిని గుర్తించడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి. ప్రపంచ నలుమూలలా వున్న ఆదివాసీలు తమ హక్కులు కాపాడబడాలని ఆగస్టు 9 తేదీన ఘనంగా ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశంలో 700 ఆదివాసీ, 75 ఆదిమ గిరిజన (పివిటిజి) తెగలతో సుమారు 10 కోట్ల మందికి పైగా జీవిస్తున్నారు. కేంద్రంలో మూడోసారి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆదివాసీల రాజ్యాంగ హక్కులను గుర్తించడానికి నిరాకరిస్తున్నది.

### జి.ఓ నెం.3కి చట్టబద్ధత

అడవులపై ఆదివాసీలు సాధించిన హక్కులను తొలగించి ప్రైవేట్ బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తున్నది. ఆదివాసీల విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. ఆగస్టు 9వ తేదీన రాష్ట్ర నలుమూలల్లో ఆదివాసీ హక్కుల దినోత్సవం ఘనంగా జరపాలి. అంతేగాక ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి. జి.ఓ నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మొదటి రోజునే రాష్ట్రంలో 16,347 పోస్టుల మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు తొలి సంతకం చేశారు. జనరల్ డిఎస్‌సి వలన ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరగదు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలంటే జి.ఓ నెం.3కి చట్టబద్ధత కల్పించాలి. అందువల్ల ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న జి.ఓ 3కు చట్టబద్ధత కల్పించి, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ప్రకటన చేయాలి.

### కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

మోడీ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఇటీవలి కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసింది. జనాభా ప్రాతిపదిక మీద 8.3 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.5 శాతం తక్కువ నిధులు కేటాయించారు.

ఈసారి బడ్జెట్‌లో రూ.13,000 వేల కోట్లు కేటాయించామని, గతం కన్నా 4.31 శాతం అధికమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. గత బడ్జెట్ కేటాయింపులు చూసినప్పుడు రూ.12,461 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది కేవలం రూ.7,605 కోట్లు మాత్రమే. 39 శాతం నిధులు ఖర్చు చేయలేదు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజన యూనివర్సిటీకి పైసా కేటాయించలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు రెండున్నర లక్షల మంది తమని అదుకుంటారని ఎదురు చూసినా అతీగతీ లేదు. మరోవైపు గోదావరి వరదల్లో వందలాది గ్రామాలు మునిగిపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ఆదివాసీ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది.